

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | బుధవారం 15-03-2023 | సంపుటి : 04 | సంచిక : 175 | పేజీలు : 4 | వెల : రూ 3-00


# సంక్షేమం..అభివృద్ధి లక్ష్యంగా పాలన

**ఏటా 11.43 శాతం జీఎస్‌డీపీ వృద్ధిరేటు**
**తలసరి ఆదాయం రూ. 2.19 లక్షలకు పెరుగుదల**
**5 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల మేరకు పనులు**
**నవరత్నాలతో మెరుగైన పాలనా విధానం**
**అమ్మఒడి ద్వారా 80లక్షల పిల్లలకు ఆర్థిక సహాయం**
**డిజిటల్ లర్నింగ్ కోసం విద్యార్థులకు 5.20 లక్షల ట్యాబ్‌లపంపిణీ**
**మనబడి, నాడు-నేడు ద్వారా రూ.3669 కోట్లతో ఆధునీకీకరణ**
**ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీల ఏర్పాటు**
**జగనన్న చేదోడు ద్వారా రూ.10 వేలసాయం**
**ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీబ్ ప్రసంగం**
**ప్రారంభమైన ఏపి అసెంబ్లీ సమావేశాలు**





అమరావతి,మార్చి14(: ఏపీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా పారదర్శక పాలన అందిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. ఈ సందర్భంగా నవరత్నాలతో ఏపీ ప్రజలకు నేరుగా నిధులు అందించా మన్నారు. నాలుగేళ్లుగా 5 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తు న్నారని చెప్పారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మంగళవారం ఉభయ సభలను ఉద్దేశించి తొలిసారిగా గవర్నర్ ప్రసంగించారు. పారదర్శకంగా పాలన సాగుతుందని.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు చేరుతున్నాయన్నారు. పరిశ్రమలు, వ్యవసాయం, సేవా రంగంలో గణనీయమైన అభివృద్ధిని సాధించినట్టుగా గవర్నర్ వివరించారు. జీఎస్‌డీపీ లో దేశంలోనే ముందువరసలో ఉందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ప్రతి ఏటా 11.43 శాతం జీఎస్‌డీపీ వృద్ధిరేటు సాధించిందని పేర్కొన్నారు. తలసరి ఆదాయం రూ. 2.19 లక్షలకు పెరిగింద న్నారు. రాష్ట్ర ఆర్థికపరిస్థితి నాలుగేళ్లుగా మెరుగు పడిందని గవర్నర్ చెప్పారు. మన బడి, నాడు-నేడు ద్వారా తొలి దశలో రూ.3669 కోట్లతో ఆధునీకీకరణ చేపట్టామన్నారు. అమ్మఒడి ద్వారా 80 లక్షల పిల్లలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. 44.49 లక్షల మంది తల్లులకు రూ.19,617.60 కోట్ల ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. డిజిటల్ లెర్నింగ్ కోసం విద్యార్థులకు రూ. 690 కోట్ల విలువైన 5.20 లక్షల ట్యాబ్‌లను పంపిణీ చేశామని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. 2020--21 విద్యా సంవత్సరం నుండి పాఠ్యాంశాల సంస్కరణలు అమలు చేస్తున్నట్లు వివరించారు. 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల రీడిజైన్ చేసినట్టుగా గవర్నర్ పేర్కొన్నారు. జగనన్న గోరుముద్దతో 43.26 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి కలగనుందని వెల్లడించారు. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నట్టుగా తెలిపారు. జగనన్న విద్యాదీవెన కింద ఫీజు రీ ఎంబర్స్ మెంట్ అమలు చేస్తున్నామ న్నారు. కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కాలేజీ, విజయనగరంలో జేఎన్‌టీయూ-గురజాడ, ఒంగోలులో ఆంధ్రకేసరి, కడపలో వైఎస్ఆర్ అర్కిటెక్చర్ ఫైన ఆర్ట్స్ వర్శిటీ, కర్నూల్‌లో ఉర్దూ యూనివర్శిటీ ఏర్పాటు చేసినట్టుగా పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేం దుకు రాష్ట్ర వ్యాప్తంగా 14 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించామని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. అంతేకాదు నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. మహిళల భద్రత కోసం దిశ యాప్‌ను ప్రారంభించామన్నారు. అటు వైద్య శాఖ ద్వారా 1.4 కోట్ల మందికి హెల్త్ కార్డులు అందించామని గవర్నర్ తెలిపారు. రూ.971 కోట్లతో ఆరోగ్య ఆసరా పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2024 నాటికి అర్హులైన ప్రజలకు శాశ్వత గృహాలను అందిస్తున్నామని గవర్నర్ వివరించారు. మహిళల పేరుతో 30.65 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు. ఇల్లు కట్టుకునేందుకు 5 నుంచి 10 లక్షల వరకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. వీటితో పాటు..ఇండ్లకు విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి నెల 1వ తేదీన వైఎన్ఆర్ పెన్షన్ ను అందిస్తున్నామన్నారు. 64.45 లక్షల మందికి రూ.66,823.79 కోట్ల పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని గవర్నర్ వెల్లడించారు. రూ.9900 కోట్లతో నాలుగేళ్ల గా ఏడాదికి రూ.15 వేల చొప్పున అమ్మఒడి పథకం కింద అందిస్తున్నామన్నారు. ప్రతీ చేనేత కుటుంబానికి ఏటా వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా రూ.24 వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా రూపంలో మత్స్యకారులకు రూ.10 వేల చొప్పున సాయం అందిస్తున్నామన్నారు. అలాగే వారికిచ్చే డీజిల్ లో సబ్సిడీ కూడా ఇస్తున్నామన్నారు. మత్స్యకారులు చనిపోయే ఇచ్చే పరిహారం రూ.10 లక్షలకు పెంచామన్నారు.





# వచ్చేది మేమే.. రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

**జగన్ పాలనలో పెట్టిన తప్పుడు కేసులు ఎత్తేస్తాం**
**ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు అదుపులేదు**
**తిరిగి యాత్రను ప్రారంభించిన లోకేశ్**



చిత్తూరు,మార్చి14(: వచ్చేది చంద్రబాబు పాలన... జగన్ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేస్తామని టీడీపీ యువనేత నారా లోకేష్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అరాచకం సృష్టించారు... వచ్చేది మేమే.. రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని కూడా అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రెండ్రోజుల పాటు వాయిదా వేసుకున్న టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం తిరిగి ప్రారంభం అయ్యింది. యాత్ర 42వ రోజుకు చేరుకోగా.. తంబళ్లపల్లె నియోజకవర్గంలో పాదయాత్ర కొనసాగుతోంది. ఈ సందర్భంగా మద్దయ్యప్పగారిపల్లి న్యూ మల్బరీ నర్సరీ వద్ద బీసీ సామాజికవర్గం ప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. బీసీలపై దాడులు, అట్రాసిటీ, అటెంప్ట్ మర్డర్ కేసులు 36 వేల మందిపై పెట్టారని... సిద్ధాంతాన్ని నమ్ముకున్నామని, ప్రజల తరపున పోరాడుతామని స్పష్టం చేశారు. వడ్డెర్లను ఆదుకుంది ఎన్టీఆర్, చంద్రబాబుమాత్రమే అని తెలిపారు. పాపాల పెద్దిరెడ్డి గనులు, క్వారీలు కొల్లగొట్టారని మండిపడ్డారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లకు జీతాలు లేవని.. కుర్చీలు కూడా లేవన్నారు. జనాభా దామాషాన బీసీలను ఆదుకుంటామని లోకేష్ హామీ ఇచ్చారు.ముందుగా కండ్లమడుగు క్రాస్ వద్ద స్థానికులతో మాటామంతీలో పాల్గొన్నారు. ఆపై హార్స్ లీ హిల్స్ క్రాస్ వద్ద పెద్దమాండ్యం మండల ప్రజలతో భేటీ అయ్యారు. కాసేపటి క్రితం మద్దయ్యప్పగారిపల్లి న్యూ మల్బరీ నర్సరీ వద్ద బీసీ సామాజికవర్గీయులతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం న్యూ మల్బరీ నర్సరీ వద్ద భోజన విరామం అనంతరం.. భోజన విరామ స్థలంలో మహిళలతో ముఖాముఖి అవనున్నారు. ఆపై మొగసాల మర్రిలో స్థానికులతో మాటామంతీ నిర్వహించనున్నారు. తరువాత కుమ్మరల్లిలో డెయిరీ రైతులతో సమావేశంకానున్నారు. సాయంత్రం 4 గంటలకు నాయనిబావి వద్ద స్థానికులతో భేటీ అవుతారు. రాత్రి నాయనిబావి పంచాయితీ గుట్టపాలెం విడిది కేంద్రంలో లోకేష్ బస చేయనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా రెండు రోజుల పాటు లోకేష్ పాదయాత్ర కు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ కారణంగా జిల్లాలో ఉ ండరాదంటూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న లోకేష్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారు.

# నాలుగో సారి సీబీఐ విచారణకు అవినాష్ రెడ్డి

హైదరాబాద్, వివేకానంద రెడ్డి హత్య కేసులో నాలుగో సారి సీబీఐ విచారణకు వైఎస్ అవినాష్ రెడ్డి హాజరు అయ్యారు. ఈసారి ఆయన ఇద్దరు న్యాయవాదులను వెంట తీసుకొని వెళ్లారు. ఎస్పీ రామ్ సింగ్ ఆధ్వర్యంలో అవినాష్ రెడ్డి విచారణ జరగనుంది. అంతకుముందు అవినాష్ రెడ్డి నేడు తాను విచారణకు రాలేనని సీబీఐకి లేఖ రాశారు. పార్లమెంటు సమావేశాలు ఉ న్నందున తనకు విచారణ నుంచి మినహాయింపు ఇవ్వాలని అవినాష్ రెడ్డి లేఖ రాసినా సీబీఐ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆయన హాజరవ్వాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే సీబీఐ మూడుసార్లు అవినాష్ రెడ్డిని విచారణ చేసింది. గత విచారణ సందర్భంగా కూడా సుదీర్ఘంగానే ఆయన్ను అధికారులు ప్రశ్నించారు. అవినాష్ రెడ్డి సరైన సమాధానాలు చెప్పడానికి ఇష్టపడకపోవడం, పొంతన లేకపోవడంతో నేడు మళ్లీ విచారణకు హాజరుకావాలని సీబీఐ అవినాష్ రెడ్డికి సూచించింది.ఎంపీ అవినాష్ రెడ్డిపై తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా చర్యలు





తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు సీబీఐని నిన్న (మార్చి 13) ఆదేశించిన సంగతి తెలిసిందే. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన కోర్టు తీర్పును కూడా రిజర్వ్ చేసింది. గత ఆదేశాల మేరకు వివేకా హత్య కేసులో ఎంపీ పాత్రపై ఆధారాలను సీబీఐ సమర్పించింది. దర్యాప్తు కీలకదశలో ఉన్నందున స్టే ఇవ్వొద్దని వాదించింది. ఇవాళ సీబీఐ విచారణకు మినహాయింపు ఇవ్వాలన్న ఎంపీ అభ్యర్థనను కూడా కోర్టు తిరస్కరించింది. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డ్ చేయాలని, తనపై కఠిన చర్యలు తీసుకోకుండా ఉండటంతో పాటు విచారణకు పిలవకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ కడప ఎంపీ అవినాష్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్పై తెలంగాణ హైకోర్టులో నిన్న విచారణ జరిగింది. జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేశారు. గత విచారణలో కోర్టు ఆదేశాల మేరకు వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి పాత్రకు సంబంధించిన అన్ని ఆధారాలను సీబీఐ సమర్పించింది.హత్య కేసుకు సంబంధించిన దర్యాప్తు స్థాయి నివేదిక, హార్డ్ డిస్క్, 10 డాక్యుమెంట్లు, వివేకా డెత్ నోట్, ఫోరెన్సిక్ నివేదిక, ఘటనా స్థలంలో ఆధారాలు చెరపకముందు తీసిన ఫొటోలు, కేసు డైరీ వివరాలను సీల్డ్ కవర్లో అందజేసింది. హత్యా స్థలిలో సాక్ష్యాల ధ్వంసంలో అవినాష్ రెడ్డి కీలక పాత్ర పోషించారని సీబీఐ తరఫు న్యాయవాదులు అనిల్కుమార్, నాగేంద్రన్ హైకోర్టుకు నివేదించారు. కోర్టు అడిగిన అన్ని పత్రాలను, రికార్డులను సమర్పించామని, దీనిపై త్వరగా తేల్చి దర్యాప్తునకు అనుమతించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, ఈ సమయంలో నిలిపివేయవద్దని సీబీఐ అధికారులు విన్నవించారు.వివేకా హత్య సమయంలో రాసిన లేఖను ఎఫ్ఎస్ఎల్ కు పంపి నివేదిక తెప్పించి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీబీఐ తెలిపింది. వివేకా రాత నమూనాను పరీక్షించి.. దానికి సంబంధించి ఫోరెన్సిక్ డిపార్ట్మెంట్ వెల్లడించిన అభిప్రాయాన్ని సమర్పించామని పేర్కొంది.

# గవర్నర్ ప్రసంగంలో కానరాని మూడు రాజధానులు

**ఎక్కడా ప్రస్తావన లేని విశాఖకు తరలింపు అంశం**

అమరావతి,మార్చి14: తాజాగా గవర్నర్ ప్రసంగంలో మూడు రాజధానుల అంశం లేకపోవడం గమనార్హం. ఏపీ బడ్జెట్ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. అయితే ఇప్పటి వరకూ ప్రతి ప్రసంగంలోనూ మూడు రాజధానుల అంశం ఉండేంది. పరిపాలనా వికేంద్రీకరణపై ప్రస్తావన ఉండేది. నేటి వరకూ త్వరలోనే విశాఖ వెళ్తానంటూ సీఎం జగన్ చెబుతూ వస్తున్నారు. గవర్నర్ ప్రసంగంలో మూడు రాజధానుల అంశం లేకపోవడానికి కారణం సుప్రీంకోర్టు విచారణనేనని తెలుస్తోంది. గవర్నర్ కూడా సుదీర్ఘకాలం పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేయడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మంగళవారం ఉదయం ప్రారంభమయ్యాయి. సభ మొదలవగానే ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగాన్ని మొదలుపెట్టారు. 5 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల కోసం సీఎం పాలన సాగుతోందన్నారు. సమీకృత అభివృద్ధి కోసం పారదర్శక పాలన అందిస్తున్నామని తెలిపారు. ఏపీలో నవరత్నాలతో సంక్షేమ పాలన జరుగుతోందని గవర్నర్ నజీర్ పేర్కొన్నారు. డీబీటీ ద్వారా అవినీతి లేకుండా లబ్ధిధారులకే సొమ్ము అందజేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయాలతో ప్రజల దగ్గరకే పాలన అందిస్తున్నామని తెలిపారు. 45 నెలల్లో 1.97 లక్షల కోట్ల నగదు ప్రజలకి చేరిందన్నారు. లబద్ధిదారుల గుర్తింపుకోసం వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు.

# ఉభయ సభల్లో మళ్లీ గందరగోళం



**ఆదానీ వ్యవహారంపై జెపిసికి డిమాండ్**
**ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎంపిల ఆందోళన**

న్యూఢిల్లీ,మార్చి14 : వరుసగా రెండోరోజూ పార్లమెంటులో ఆదానీ వ్యవహారం గందరగోళానికి దారితీసింది. దీనిపై జెపిసి వేయాలని కోరుతూ బిఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. వాయిదా తీర్మానాలపై చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. లోక్‌సభలో ఇవాళ విపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి. అదానీ అంశంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేశాయి. ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. బీఆర్ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు కూడా పార్లమెంట్‌లో నిరసన చేపట్టారు. అదానీ అంశంపై జేపీసీ విచారణ చేపట్టాలని రెండు పార్టీలు డిమాండ్ చేశాయి. భారత రాష్ట్ర సమితితో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ పాలనలో న్యాయశాస్త్ర నియమాలను తుంగలో తొక్కారని, ప్రజాస్వామ్యం కూనీ అవుతుందని ఆయన మండిపడ్డారు. అదానీ అంశంపై ప్రతిపక్షాల ఆందోళనలతో ఉభయసభలు మధ్యాహ్నానికి వాయిదా పడిన అనంతరం ఖర్గే పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని నియంతృత్వ ధోరణితో నడిపిస్తోందని, పైగా ప్రభుత్వ పెద్దలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటారని ఖర్గే ఎద్దేవా చేశారు. అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) కోసం తాము డిమాండ్ చేస్తున్నామని, అయితే తాము ఆ అంశాన్ని లేవనెత్తినప్పుడల్లా మైకులు కట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో సభలో గందరగోళం నెలకొందంటూ సభను వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. పార్లమెంట్ ఆవరణలో బీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన నిర్వహించారు.ఇడీ, సీబీఐ మరియు ఐటీలను కేంద్రం దుర్వినియోగం చేస్తూ.. విపక్షాల మీద కక్ష సాధింపు రాజకీయాలను చేస్తోందని, రాష్ట్రల్లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడదోస్తూ.. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తుందని బీఆర్ఎస్ ఎంపీలు, విపక్ష సభ్యులు పార్లమెంట్‌లో ఆందోళనకు దిగారు. ఈ అంశంపై తక్షణం చర్చ నిర్వహించాలని వాయిదా తీర్మానం ఇచ్చారు.ఉభయ సభలు వాయిదాపడటంతో.. పార్లమెంట్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం వద్దకు చేరిన బీఆర్ఎస్ ఎంపీలు అక్కడే ధర్నా నిర్వహించారు.

## సంపాదకీయం

బుధవారం 15-03-2023

# నేతలపై మరక..మంచిదేనా

అవినీతి ఆరోపణలను ఎదుర్కొనడం రాజకీయాలలో రాణించడానికి ఒక క్రెడిట్ గా నాయకులు భావిస్తున్నారా? అవినీతి మరక అంటితేనే జనంలో గుర్తింపు వచ్చినట్లుగా భావిస్తున్నారా? ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీ నేతలకు ఈ మరక మంచిదేనా? అంటే జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఔననే అనిపించక మానదు అంటున్నారు రాజకీయ పరిశీలకులు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో రాజకీయ పరిస్థితులను గమనిస్తే.. అవినీతి మరక అంటిన.. అంటే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులే గట్టిగా అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడటం, తమపై ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమేనంటూ ప్రకటనలు గుప్పించడం చూస్తుంటే.. ఆ మరకనే పాపులర్ లీడర్ గా మారే అవకాశాన్ని సృష్టించుకునే ప్రయత్నం చేస్తున్నారా అన్న భావన కూడా పొలిటికల్ సర్కిల్స్ లో వ్యక్తమౌతోంది.మొత్తంగా చూస్తే అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న వారిలో అత్యధికులు రాజకీయ నేతలే ఉంటున్నారు. మొత్తంగా పార్టీలకు పార్టీలు, ప్రభుత్వాలకు ప్రభుత్వాలు ఈ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇప్పుడు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఢిల్లీ మద్యం కుంభకోణం విషయానికి వస్తే.. ఈ కుంభకోణంలో ఆరోపణలు చేస్తున్నవారూ.. ఆరోపణలను ఎదుర్కొంటున్న వారూ అందరూ రాజకీయ నేతలే. మొత్తంగా ఈ కుంభకోణమే ఒక ప్రభుత్వ మద్యం విధానానికి సంబంధించినది. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం అమలు చేసి ఉపసంహరించుకున్న మద్యం విధానంలో లోపాలున్నాయంటూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఫిర్యాదు ఈ తేనెతుట్టె కదలడానికి ఆధారభూతంగా మారింది.మద్యం కుంభకోణానికి ముందూ తరువాతా కూడా ఇలా అవినీతి ఆరోపణల్లో చిక్కుకుని రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్న నేతలు పలువురు ఉన్నారు. ఎపి సిఎంగా ఉన్న జగన్, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, తృణమూల్ మంత్రులు, ఆప్ నేతలు ఇలా చెప్పుకుంటూ పోతే ఈ జాబితా కొండవీటి చాంతాడంత ఉంటుందనడానికి సందేహం అవసరం లేదు. ఇక ప్రస్తుతం దేశ వ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్న ఢిల్లీ మద్యం కుంభకోణం విషయంలో నేరం రుజువు కాలేదు. ఆరోపణల మరకలు మాత్రమే పడ్డాయి.ఆ మరక అంటుకున్న నేతలకు విపక్షాలు మద్దతుగా నిలుస్తున్నాయి. అదే మరక పడిన తెలంగాణ ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణకు హాజరైన క్రమంలో రాత్రికి రాత్రి జాతీయ రాజకీయాలలో ప్రధాన ఆకర్షణగా మారిపోయారు. ఆమె ఈడీ విచారణకు హాజరవ్వడానికి ముందు వరకూ ఆమె తండ్రి, బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయ ప్రస్థానం కొండ ఎక్కదు.. కొండ దిగదు అన్నట్లుగా తొలి అడుగులోనే అటూ ఇటూ కదలకుండా స్థిరంగా ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో సత్తా చాటుతామంటూ ఆయన చేస్తున్న ప్రకటనలు వినా ఆ దిశగా కదలిక ఇసుమంతైనా కనిపించిన దాఖలాలు లేవు. అయితే ఎప్పుడైతే ఈ కుంభకోణంలో కవితను విచారణకు ఈడీ పిలిచిందో.. అప్పుడే జాతీయ స్థాయిలో రాజకీయ కదలిక ఆరంభమైంది. దాదాపు 18 పార్టీలు కవితకు మద్దతుగా ఢిల్లీలో ఏకతాటిపైకి వచ్చాయి.తాను ఈడీ విచారణకు హాజరు కావడానికి ఒక రోజు ముందు చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం ఆమె చేపట్టిన దీక్షకు మద్దతు పలికాయి. ఆమెతో పాటు ఆయా పార్టీల నాయకులూ దీక్షలో కూర్చున్నారు. ఆ దీక్షా వేదిక నుంచే మద్యం కుంభకోణంలో కవితను ఈడీ విచారణకు పిలవడాన్ని ఖండించారు. ఈ ఖండన, ఆయా పార్టీల మద్దతు కచ్చితంగా బీఆర్ఎస్ కు రాజకీయంగా జాతీయ స్థాయిలో ఒక ముందడుగు వేసేందుకు అవకాశం ఇచ్చిందనే చెప్పాలి. అలాగే కవితకు సంఘీ భావంగా హస్తిన వెళ్లిన బీఆర్ఎస్ అగ్రనేతలు, తెలంగాణ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు బీఆర్ఎస్ జాతీయ ప్రస్థానానికి అవసరమైన అడుగులు వేయడానికి వీలుగా రోడ్ క్లియర్ చేసే కార్యక్రమం చేపట్టారని కూడా బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో కవిత తన ఒక్కరి తరఫునే కాకుండా ఈడీ, సీబీఐ, ఈడీ కేసులు ఎదుర్కొంటున్న విపక్షాలకు చెందిన అందరి నాయకుల తరఫునా వకల్తా పుచ్చుకున్నారు.ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికలకు ముందు ప్రచారం కోసం మోడీ రావడానికి ముందుగానే ఈడీ, సీబీఐ, ఐటీలు వస్తాయన్న ఆమె వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థం ఒక్కటే. ఈ వేధింపులు ఒక్క తెలంగాణ రాష్ట్రానికే పరిమితమై లేవనీ, బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న అన్ని రాష్ట్రాలలోనూ విపక్షాలకు ఈ వేధింపులు ఉన్నాయనీ, ఉంటాయనీ కవిత అంటున్నారు. దాదాపు విపక్షాలన్నిటిదీ అదే మాట. ఇప్పటి వరకూ వేటికవిగా ఉన్న పార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కవిత ఈడీ విచారణ ఎపిసోడ్ ను వేదికగా చేసుకునేందుకు బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తోందని అంటున్నారు. ఆ విధంగా చేస్తు కవితపై పడిన ఈ అవినీతి మరక మంచిదేనని బీఆర్ఎస్ భావిస్తోందా అన్నే చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో జోరందుకుంది.

# ప్రజారాజ్యం బాటలోనే... జనసేనా..

విజయవాడ, మార్చి 14, పవన్ కళ్యాణ్ ..తెలుగు రాజకీయాల్లో ఒక బలమైన ఫోర్స్. ఆయనకున్న ఆకర్షణ.. అభిమాన జనం అసాధారణం. అయితే..పార్టీ పెట్టి పదేళ్లు గడిచినా....జనసేన ఇంకా చెప్పుకోదగ్గ స్థాయిలో బలం పుంజుకోలేదు. సీట్లు గెలవలేదు. కారణం పార్టీ విధానాలూ.. పోకడల్లో నెలకొన్న సమన్వయం లోపాలే తప్ప జనం కాదన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఈ విషయాన్ని అధినేత పవన్ కల్యాణ్ గ్రహించలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మధ్య పవన్ కల్యాణ్ పదే పదే వాడుతున్న మాట " ఎంతో ఆదాయం ఇచ్చే సినిమాలను వదులుకుని మీ కోసం వచ్చాను" అని కొన్నాళ్ళ క్రితం వరకూ సినిమాకు 50కోట్ల ఆదాయాన్ని వదులుకుని రాజకీయాల్లోకి వచ్చాను అని అనే పవన్ తాజాగా రోజుకు రెండు కోట్ల ఆదాయం తాను సినిమాల్లో నటిస్తే వస్తుంది అని అన్నారు. కానీ ఇలాంటి మాటలు ఆయనపై సామాన్య జనంలో సానుభూతిని రప్పించే అవకాశం ఉండదని తెలుసుకోవడం లేదు. ఇప్పటి ట్రెండ్ ప్రకారం అయితే ఎవరు అంత ఆదాయం వదులుకుని రమ్మన్నారు అని కౌంటర్ లు పడతాయి తప్ప పవన్ ఆశయాలను గుర్తించరు. పవన్ కళ్యాణ్ అంత ఆదాయన్నిచ్చే సినిమా రంగాన్ని వదిలి మాకోసం రాజకీయాల్లోకి వచ్చాడనే ఫీలింగ్ జనం నుంచి స్వతహాగా రావాలి తప్ప .. ఆ మాట పవన్ స్వయంగా పదే పదే చెప్పడం వల్ల మంచి ఇంప్రెషన్ అయితే కలిగే అవకాశాలు లేవన్నది విశ్లేషకుల అభిప్రాయం.ప్రజారాజ్యం సమయంలో మెగాస్టార్ చిరంజీవి కూడా ఇంతే. " మీరు రాజకీయాల్లోకి రమ్మన్నారు..నేను వచ్చేసాను" అంటూ జనం పైనే తనను గెలిపించే భారం అన్నట్టు మాట్లాడేవారు. ఇది పెద్ద బూమెరాంగ్ అయింది ఆ రోజుల్లో. ఎవరైనా సరే రాజకీయాల్లోకి వచ్చేది పదవుల కోసం అనేది సుస్పష్టం. ప్రజలకు సేవ చేయాలనే ఆశయం ఎంతో కొంత ఉండొచ్చు.. కానీ అంతిమ లక్ష్యం అధికారమే.ఈ మోడ్రన్ పాలిటిక్స్ యుగంలో చిన్న పిల్లాడికి సైతం తెలిసిన సత్యం ఇది. కాబట్టి ఈ రకమైన మాటలు పవన్ కచ్చితంగా మార్చుకోవాల్సిందే.కేటీఆర్ అమెరికాలో ఉద్యోగం చేసుకునే సమయంలో రాజకీయాల్లో రావాలని తెలంగాణ మూమెంట్‌ను వేదికగా చేసుకుని ఎంట్రీ ఇచ్చారు. అంత ఉద్యమం జరుగుతున్న సమయంలో కూడా జనం తనను రావాలని కోరారు..అందుకే అమెరికాలో ఉద్యోగం వదిలి వచ్చేశా లాంటి మాటలు ఆయన ఎప్పుడూ మాట్లాడలేదు. జగన్ కూడా "ఓదార్పు యాత్ర చేస్తా..ముఖ్యమంత్రి అవుతా.. రాజన్న బిడ్డను ఆశీర్వదించండి " అన్నారు గానీ మీ కోసం బిజినెస్‌లు వదిలేసి వచ్చేశా లాంటి మాటలు మాట్లాడలేదు. వాళ్ళ లక్ష్యం ఏంటో ప్రజలకూ...వాళ్లకూ క్లారిటీ ఉంది. అధికారం కోసమే ఇదంతా అనే స్పష్టత ఓటర్లకు ఎప్పుడూ ఉంది. ఈ ప్రాసెస్‌లో వాళ్ల విధానాలు..మాటతీరు... కార్యకర్తలను కలుపుకుని పోవడంలాంటివి నచ్చి జనం వారిని అందలం ఎక్కించారు. రేపు నచ్చక పోతే దించేస్తారు అంతేగానీ, జనంతో మీ కోసమే అన్నీ వదిలేసి రాజకీయాల్లోకి వచ్చాము లాంటి డైలాగ్స్ చెప్పలేదు.చివరికి నారా లోకేష్ సైతం తమ ఓటమికి తమదే బాధ్యత అన్నారు గానీ.. జనాన్ని తప్పు బట్టే ప్రయత్నం చెయ్యలేదు. ఇప్పటికీ జగన్ ప్రభుత్వంలో అవకతవకలు జరుగుతున్నాయి..కాబట్టి నెక్స్ట్ తమకు అవకాశం ఇవ్వమని అంటున్నారే తప్ప..మీకోసం రాజకీయాల్లోకి వచ్చినా ఓడించారు లాంటి మాటలు పొరబాటున కూడా వాడట్లేదు. పవన్ మిస్ అవుతున్న పాయింట్ ఇదే.1983లో అప్పటికీ నెంబర్ వన్ హీరోగా ఉన్న ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ప్రజాసేవ కోసం తనను ఇంత ఆదరించిన తెలుగు ప్రజల రుణం తీర్చుకోవడానికి వస్తున్నట్లు చెప్పారు తప్ప.. ఏ నాడూ .."మీ కోసమే సినిమాలు వదిలేసి వచ్చాను.." లాంటి మాటలు మాట్లాడలేదు. కెరీర్ లానే పాలిటిక్స్ ఒక ఇండివిడ్యువల్ చాయిస్ . ఎవరికి ఇష్టం అయితే వారు వస్తారు తప్ప.."మీ కోసం అది వదిలేసా.. నేను సినిమాలే చేస్తే ఇంత డబ్బు సంపాదిస్తా లాంటి మాటలు" ప్రజాజీవితంలో సరికావని జనసే నాని ఎంత తొందరగా గుర్తిస్తే పార్టీకి అంత బలం అనేది విశ్లేషకుల అభిప్రాయం.

# కాటన్ సంచిలకు కేరాఫ్ అడ్రస్

తిరుపతి, మార్చి 14, అది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పాలగుట్టపల్లె! పాకాల పక్కన ఉండే చిన్నగ్రామం. కాస్త చీకటి పడితే బస్సు ఉండదు.! ఆటోలు అంతకన్నా తిరగవు. తీవ్రమైన కరువు. 2010 నుంచి ఐదేళ్లు వాన చినుకు పడలేదు. ఎటుచూసినా ఎండిన బీళ్లు. వ్యవసాయం అడుగంటి పోయింది. తిప్పికొడితే 70 కుటుంబాలు ఉంటాయేమో. అందరూ వ్యవసాయ కూలీలే. కొద్దోగొప్పో పాడి, కోళ్లు. అలాంటి ఒక గ్రామం ఇవాళ కాటన్ బ్యాగులకు కేరాఫ్ గా నిలిచిందీ అంటే.. ఆ సక్సెస్‌కి కారణం అపర్ణ అనే సామాజిక కార్యకర్త! పాలగుట్టపల్లె బ్యాగులంటే ఇవాళ ఒక బ్రాండ్.చెన్నైకి చెందిన అపర్ణాకృష్ణన్ దాదాపు 30 ఏళ్లక్రితం పాలగుట్టపల్లెలో కొంత భూమి కొని, సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారు. వర్షాలు లేని 2010-15 మధ్య కాలం ఆమెని కలవరపెట్టింది. తన సంగతి పక్కన పెడితే, వ్యవసాయం మీదనే ఆధారపడి, కూలీనాలి చేసుకునే పల్లె ప్రజల పరిస్థితి ఏంటని ఆవేదన చెందారు. సామాజిక బాధ్యత కలిగిన అపర్ణ వాళ్లను ఏదో రకంగా ఆదుకోవాలని అనుకున్నారు. ఊరిలో కొంతమంది మహిళలకు కుట్టుమిషన్ ఉంది. జాకెట్లు, చిన్నచిన్న దుస్తులు కుట్టేవారు. వాళ్లని చేరదీస్తే మిగతా మహిళలకు కూడా ఉపాధి దొరుకుతుందని అపర్ణ భావించారు. అలా వారిని కాటన్ సంచుల తయారీకి సిద్ధం చేశారామె.అపర్ణా కృష్ణన్ తన చేతుల మీదుగా కొంత డబ్బు అడ్వాన్స్‌గా ఇస్తే, వాటితో కాటన్ బట్ట కొనుక్కొచ్చి వంద బ్యాగుల వరకు కుట్టిచ్చారు. అలా మొదలైంది వీరి ప్రయాణం. జూట్ బ్యాగులు కళావిహీనంగానే కనిపిస్తాయి. అలా అయితే వేరే బ్యాగులకు ఈ పల్లె బ్యాగులకు తేడా ఏముంటుంది. అందుకని అపర్ణ వీరికో ఐడియా ఇచ్చింది. పాలగుట్టపల్లె బ్యాగులకు ప్రత్యేకత రావాలంటే సంచుల మీద అందమైన ప్రింట్లు, ఎంబ్రాయిడరీ వగైరా వుండాలి. అలా అయితే కస్టమర్లను ఇట్టే ఆకట్టుకోవచ్చు. అపర్ణ సూచనతో నలుగురైదుగురు ఎంబ్రాయిడరీ వర్క్ నేర్చుకున్నారు. నెమలి, వినాయకుడి బొమ్మలతో పాటు, ఆర్డర్లు ఇచ్చే కంపెనీల లోగోలు, ప్రింట్లు వేసి, కుట్టి పంపుతుంటారు. ఆ ఐడియాతో బ్యాగులకు ఇంకా మంచి పేరు వచ్చింది. ఆ మధ్య యూపీలో జరిగిన ఆర్గానిక్ కాంగ్రెస్ సదస్సుకి ఆరువేలకు పైగా సంచులు కుట్టి పంపించారు. ఆ తర్వాత కంపార్టుమెంటులుగా ఉండే కూరగాయల సంచులు తయారుచేశారు. వాటికైతే బాగా డిమాండ్ వచ్చింది. ఇక ఆర్గానిక్ ప్రాడక్ట్స్ అమ్మే షాపుల నుంచి ఆర్డర్లు కుప్పలు తెప్పలుగా వస్తుంటాయి.కాటన్ బ్యాగులు కుడతారు సరే! ఆర్డర్లు ఎలా? వాటికి మార్కెటింగ్ ఎలా? ప్రచారం ఎలా? పెట్టుబడి ఎక్కడినుంచి వస్తుంది! వీటన్నిటినీ అపర్ణే దగ్గరుండి చూసుకున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాను నమ్ముకున్నారు. అందులోనూ ప్రధానంగా వాట్సప్. ఆ తర్వాత వెబ్ సైట్. మెటీరియల్‌ను సేకరించడం మొదలుకుని ప్రోటోటైప్‌లను తయారు చేయడం, డెలివరీ గడువులను నిర్ధారించడం, క్వాలిటీ కంట్రోల్ ఇలా పూర్తిగా ఈ పల్లె మహిళలే నిర్వహిస్తారు. వీళ్లకి అక్షరం ముక్కరాదు. అయినా వ్యాపారమంతా వాట్సప్, వెబ్ సైట్ ద్వారానే చేస్తుంటారు. అంటే ఈ లెక్కన ఊరిలో మహిళలంతా డిజిటల్ అక్షరాస్యులే అన్నమాట. వచ్చిన డబ్బుతోనే ఇప్పటివరకు రొటేషన్ చేసుకుంటూ వచ్చారు. కాటన్ బట్ట, పెయింటింగ్ వగైరా మధురై నుంచి వస్తుంది.ఇప్పటి వరకు 50వేల బ్యాగ్‌లను అమ్మారంటే అతిశయోక్తి కాదు. జూ, జఐ, కెనడా వంటి దేశాలలో కూడా వీళ్లకు కస్టమర్లు ఉన్నారు. ఊరగాయలను కూడా తయారు చేస్తుంటారు. కరోనా కారణంగా వ్యాపారం దెబ్బతిన్నా మళ్లీ పుంజుకున్నారు. కష్ట సమయంలో ఈ ఊరి మహిళల స్వయం సమృద్ధి తోడుగా నిలిచిన అపర్ణా కృష్ణన్ కృషి ఎంతైనా అభినందనీయం.

# స్టీల్ ప్లాంట్ కు కుకింగ్ కోల్ ఇబ్బందులు

విశాఖపట్టణం, మార్చి 14, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న కోకింగ్ కోల్, ఐరన్ ఓర్ కొరత సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. భారీ పెట్టుబడులతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా 3.2 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నులకు విస్తరిస్తే ప్రస్తుతం అందులో మూడింట ఒకటో వంతు మాత్రమే ఉక్కు ఉత్పత్తి జరుగుతున్న విషయం వాస్తవమేనా అని విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ అది వాస్తవం కాదని చెప్పారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్, స్టీల్ మెల్టింగ్ షాప్‌ను అధునీకరించి 7.3 మిలియన్ టన్నుల కెపాసిటీకి పెంచినప్పటికీ సమగ్ర ఉక్కు ఉత్పాదన సామర్థ్యాన్ని 7.3 మిలియన్ టన్నులకు విస్తరించలేదని మంత్రి తెలిపారు. అలాగే తీరప్రాంతంలో ఉన్నందున వాతావరణంలోని ఉప్పు సాంద్రత కారణంగా స్టీల్ ప్లాంట్‌లోని భారీ పరికరాలకు తుప్పు పట్టే అవకాశం లేదా అన్న మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ స్టీల్ ప్లాంట్‌ను తీరప్రాంతంలో నెలకొల్పుతున్నందున ఎక్విప్‌మెంట్ సమకూర్చుకునే దశలోనే ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకుని తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. పూర్తి సామర్థ్యం మేరకు స్టీల్ ప్లాంట్‌లో ఉక్కు ఉత్పాదన జరిగేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్మాణాత్మక చర్యల గురించి మంత్రి ఈ విధంగా వివరించారు.

1) వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు నిరాటంకంగా కోకింగ్ కోల్ సరఫరా చేసే అంశంపై బొగ్గు మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నాం.

2) వైజాగ్ స్టీల్ కోసం ఒక ఇనుప ఖనిజం బ్లాక్‌ను ప్రత్యేకంగా కేటాయించాల్సిందిగా ఒడిషా ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.

3) ఇనుప ఖనిజ నిక్షేపాలను తమ కోసం ప్రత్యేకంగా రిజర్వ్ చేయవలసిందిగా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేయమంటూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఇప్పటికే ఒడిషా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలను కోరింది.

4) స్టీల్ ప్లాంట్ వర్కింగ్ కేపిటల్ అవసరాల కోసం సులభతరమైన వడ్డీతో రుణాల మంజూరు కోసం వైజాగ్ స్టీల్ యాజమాన్యం వివిధ బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతోంది.వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న పలు ఇతర ఇబ్బందులను అధిగమించేందుకు ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశంపై చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# ముందస్తు ఊహాగానాలు...

విజయవాడ, మార్చి 14, ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్సార్సీపీ గడువుకు ముందే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తుందనే అనుమానాలు ప్రతిపక్షాల్లో ఉంది. ప్రత్యర్థులు సిద్ధమయ్యేలోపు ఎన్నికలకు వెళ్లడం ద్వారా వాటి అవకాశాలకు గండి కొట్టాలనే ప్రయత్నాలు చేస్తుందనే అనుమానం పార్టీలకు ఉంది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2024లో జరగాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌తో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగాల్సి ఉంది. అయితే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు విడివిడిగా జరగొచ్చనే అనుమానం బీజేపీ నాయకుల్లో వ్యక్తమవుతోంది. లోక్ సభ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం 2024 ఏప్రిల్-మే నెలల్లోనే జరిగినా అసెంబ్లీ ఎన్నికలకు ఆర్నెల్లు ముందుగానే జరగొచ్చని బీజేపీ నేతలు భావిస్తున్నారుఏపీలో ముందస్తు ఎన్నికలు జరుగుతాయనే ప్రచారం గతంలో కూడా జరిగింది. దేశ వ్యాప్తంగా ఒకేసారి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల్ని నిర్వహించాలనే ప్రతిపాదన జరిగినపుడు కేంద్ర ప్రతిపాదనకు ఏపీ సానుకూలంగా స్పందించిందని కథనాలు వెలువడ్డాయి. ఎన్నికల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ కూడా సానుకూలంగా స్పందించింది. అయితే బీజేపీయేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు మాత్రం ఈ ప్రతిపాదనను తిరస్కరించాయి. జమిలీ ఎన్నికలకు అమోదం తెలుపలేదు. రెండేళ్లుగా ఈ ప్రతిపాదన పలుమార్లు చర్చకు వచ్చిన ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జమిలీ ఎన్నికల వ్యవహారం మరుగునపడిపోయింది. అనూహ్యంగా ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైఎస్సార్సీపీ ముందస్తు ఎన్నికలకు వెళ్లొచ్చనే అనుమానం బీజేపీకి వచ్చింది. ఎన్నికల పొత్తులు, సర్దుబాట్ల విషయంలో ఇప్పటికీ రాజకీయ పార్టీల మధ్య క్లారిటీ రాకపోవడం, ఎన్నికలకు బాగా సమయం ఉన్నందున ప్రతిపక్ష పార్టీలు రిలాక్స్ అవుతున్నాయనే ఆలోచన వైసీపీకి ఉందని బీజేపీ నాయకులు చెబుతున్నారు.సార్వత్రిక ఎన్నికల కంటే ఆర్నెల్ల ముందే వైసీపీ ఎన్నికలకు వెళుతుందని బీజేపీ ఎంపీ ఒకరు అంచనా వేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలతో పాటే ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగొచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వం, గృహ సారథుల నియామకం వంటి కార్యక్రమాలతో వైఎస్సార్సీపీ ఎన్నికల ప్రచారానికి సిద్ధమైపోయిందని, మరోవైపు రాజధానుల విషయంలో ఆ పార్టీ ఆలోచనల్ని ఆచరణల్ని పెట్టలేకపోవడం, కోర్టు వివాదాల నేపథ్యంలో జనంలోనే తేల్చుకునే ప్రయత్నం చేస్తుందంటున్నారు.ముందస్తు ఎన్నికలకు వెళితే ప్రతిపక్ష పార్టీలకు కూడా తగినంత సమయం లభించదని అది తమకు లాభిస్తుందనే భావన వైసీపీకి ఉందని బీజేపీ నాయకుడు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో రాజకీయ పొత్తు ఉండదని ఇప్పటికే వైసీపీ ప్రకటించిందని, మిగిలిన పార్టీల్లో ఎవరితో ఎవరు పొత్తు పెట్టుకోవాలనే విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడాన్ని తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు కూడా ఉండొచ్చని అంచనా వేశారు. సాధారణ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు మధ్య కనీసం ఆర్నెల్లు గ్యాప్ ఉండొచ్చని, ప్రభుత్వ వ్యతిరేకతకు అడ్డు కట్ట వేయడంతో పాటు ఆర్థికపరమైన కారణాలు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉండి ఉంటాయని విశ్లేషించారు.ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో చాలా వరకు ప్రత్యక్ష నగదు బదిలీతో ముడిపడి ఉన్నవే కావడం, వాటిని అమలు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులు కూడా ముందస్తు ఎన్నికలకు ఓ కారణమై ఉండొచ్చన్నారు. వైసీపీ వర్గాలు మాత్రం ముందస్తు ఎన్నికలు ఊహాగానాలేనని కొట్టి పారేస్తున్నాయి. అయితే జగన్మోహన్ రెడ్డి మనసులో ఏముందో ఎవరికి తెలిసే అవకాశాలు లేనందున ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేమని మాత్రం చెబుతున్నారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనుకుంటే కేంద్ర ప్రభుత్వ పెద్దల అమోదం కూడా అవసరమేనని చెబుతున్నారు. బీజేపీతో వైసీపీకి నేరుగా ఎలాంటి పొత్తు లేకపోయినా రాజకీయ అవగాహన మాత్రం మెండుగా ఉందని గుర్తు చేస్తున్నారు.

# నష్టాల బాటలో పౌల్ట్రీ ప్రరిశ్రమ

## పెట్టుబడి ఖర్చులు తడిసిమోపెడు

విజయవాడ,మార్చి14 : కరోనా దెబ్బతో తొలినాళ్లలో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. చికెన్ అమ్మకాలు తగ్గాయి. పలు ప్రాంతాల్లో అయితే ఏకంగా కోళ్లను బొందపెట్టారు. అమ్ముకోలేక, కోళ్లను సాకలేక రైతులు నానాయాతన పడ్డారు. చికెన్ కిలో ధర 50కి పడిపోయింది. కానీ ఇప్పుడు మళ్లీ ధరలు పెరిగాయి. కిలో 300కుచేరువలోకి వచ్చింది. తరవాత హెచ్చుతగ్గులు వచ్చాయి. ఇప్పుడు మార్కెట్లో చికెన్ ధర 200గా ఉంది. దీనికితోడు ఎండాకాలం కావడంతో మరింతగా ధరలుపెరిగే అవకాశం ఉంది. అయినా నష్టాలు తప్పడం లేదని పౌల్ట్రీరైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో కరోనా దెబ్బకు అన్ని రంగాల్లో మాంద్యం నెలకొంది. మార్కెట్లు కుప్పకూలాయి. బంగారం ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నవారికి ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు ఇస్తూ వస్తోంది. కానీ ధరలతో దెబ్బతింటున్న సామాన్యులకు మాత్రం ఊరట దక్కడం లేదు. రాష్ట్రంలో పౌల్ట్రీరంగం దాదాపు 25 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నది. కోళ్లు, గుడ్లు మంచి ప్రొటీన్ అని, ఎలాంటి అనుమానాలు లేకుండా తినాలని.. వస్తున్నప్రచారం నేపథ్యంలో ఇప్పుడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ మళ్లీ పుంజుకుంటోంది. దీనికి తోడు వేసవిలో సాధారణంగా వచ్చే వైరస్‌తో కోళ్లు చనిపోతుండడం కూడా పరిశ్రమకు శాపంగా మారింది. బర్డ్ ఫ్లూ వచ్చినపుడు ఎలాంటి పరిస్థితి ఉందో కరోనా కారణంగా పరిస్థితి ఘోరంగా ఉంది. కేవలం అపోహల వల్లే పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. బర్డ్‌ఫ్లూ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించాయి. ఇప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోకపోతే పౌల్ట్రీ రంగం నామరూపాల్లేకుండా పోతుంది.

# విలీన మండలాలకు రైలు సౌకర్యం


ఏలూరు, మార్చి 14, ఏజెన్సీ ప్రాంతాల్లో త్వరలో రైలు కూత వినిపించనుంది. మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు 173 కి.మీ. కొత్త రైల్వేలైను ఏర్పాటుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయంతో పోలవరం ముంపు మండలాల్లోని చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల్లో నాలుగు రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు ఇప్పటికే సర్వే పూర్తి అయినట్లు రైల్వే వర్గాలు ప్రకటించాయి.ఏజెన్సీ ప్రాంతంలో త్వరలో రైలు కూతలు వినిపించబోతున్నాయి. ఇప్పటివరకు రోడ్డు మార్గంలో బస్సులు, ఇతర వాహనాలు, గోదావరిలో లాంచీలలో మాత్రమే తిరిగిన ఏజెన్సీలో ఇకపై రైళ్లు కూడా రాకపోకలు సాగించనున్నాయి. ప్రస్తుతం గిరిజన ఆవాస ప్రాంతాల ప్రజలు రైలులో ప్రయాణించాలంటే రాజమహేంద్రవరం, ఖమ్మం, కొత్తగూడెం వెళ్లాల్సి ఉంది. నూతన లైను ఏర్పాటులో భాగంగా మన్యం ఏరియాలో నాలుగు రైల్వే స్టేషన్లు నిర్మించనున్నారు.మారుమూల గిరిజన ప్రాంతాలకు రైలు మార్గాన్ని అనుసంధానం చేస్తూ రవాణాను సులభతరం చేసేందుకు ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు సుమారు 173 కిలో మీటర్ల మేర రైల్వేలైను మంజూరైంది. కొత్త రైలు మార్గం నిర్మాణానికి రూ 2,800 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. ఈ లైన్‌ను మల్కన్‌గిరి నుంచి భద్రాచలం సమీపంలోని పాండురంగాపురం రైల్వేస్టేషన్ వరకు నిర్మిస్తారు. కొత్త రైల్వే లైను ఏర్పాటులో భాగంగా పలుచోట్ల 213 వంతెనలు నిర్మించనున్నారు. వీటిలో 48 పెద్ద వంతెనలు, 165 చిన్న వంతెనలు ఉన్నాయి. వాగులు, వంకలు, గోదావరి ఉపనదులు, పంట కాల్వల మీదుగా రైల్వే లైను నిర్మాణం జరగనుంది.మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు నిర్మించనున్న కొత్త రైల్వేలైను విలీన మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల మీదుగా సాగనుంది. ఒడిశాలోని మల్కన్‌గిరి, కోవాసిగూడ, బదలి, రాజన్‌గూడ, మహరాజ్‌పల్లి, లూనిమన్‌గూడ, ఆంధ్రా ప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కన్నాపురం, కూనవరం మండలం కూటూరు గట్టు, పల్లూరు, ఎటపాక మండలం నందిగామలో రైల్వే స్టేషన్లు ఏర్పాటుచేస్తారు.నందిగామ నుంచి తెలంగాణలోని గోదావరి మీదుగా భద్రాచలం, అక్కడి నుంచి పాండురంగాపురం వరకు ఈ రైల్వేలైను నిర్మించనున్నారు. రైల్వే లైన్ సర్వే పూర్తి కావడంతో వీలైనంత త్వరగా కొత్త రైలు మార్గాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. బొగ్గుతో పాటు, ఖనిజ పదార్థాల రవాణాకు కొత్త రైలు మార్గం అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ రైలు మార్గం నిర్మాణానికి ఐదు నుంచి పదేళ్ల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు.

# వివేకా, కోడికత్తి కేసులతోనే ఇబ్బందులు

విజయవాడ, మార్చి 14,2019 ఎన్నికలలో వైసీపీ విజయానికి ప్రధాన కారణాలలో ముందువరుసలో ఉన్న ఆ రెండు సంఘటనలే ఇప్పుడు 2024 ఎన్నికలలో అదే వైసీపీకి ప్రతికూలంగా మారనున్నాయా? అంటే వైసీపీ శ్రేణుల నుంచి సామాన్య జనం వరకూ ఔననే అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ ఆ రెండు సంఘటనలూ ఏమిటంటే.. ఒకటి విశాఖ విమానాశ్రయంలో అప్పటికి విపక్ష నేతగా ఉన్న జగన్ పై జరిగిన కోడి కత్తి దాడి కాగా రెండోది.. జగన్ సొంత బాబాయ్ వివేకానందరెడ్డి పులివెందులలోని తన స్వగృహంలో దారుణ హత్యకు గురి కావడం. ఈ రెండు సంఘటనలూ జగన్ 2019 ఎన్నికలలో విజయం సాధించడానికి దోహదపడ్డాయనడంలో సందేహం లేదు.సరే ఆ తరువాత ఎన్నికలలో విజయం సాధించి జగన్ అధికారంలోకి వచ్చి కూడా నాలుగు సంవత్సరాలు కావస్తోంది. ఈ నాలుగేళ్ల కాలంలోనూ ఈ రెండు సంఘటనలకు సంబంధించిన కేసులూ ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి. కోడి కత్తి కేసు విషయానికి వస్తే.. తనపై దాడి జరిగిందంటూ అప్పట్లో ఊరూవాడా ఏకం చేసి ఎన్ఐఏ దర్యాప్తును సాధించుకున్న జగన్ తాను ముఖ్యమంత్రి అయ్యాకా.. ఆ కేసు ను పట్టించుకున్న దాఖలాలే లేవు. పైపెచ్చు ఈ కేసు ముందుకు సాగాలంటే.. బాధితుడిగా జగన్ కోర్టుకు హాజరు కావాలని ఎన్ఐఏ కోర్టు పేర్కొన్నా.. జగన్ హాజరు కావడం లేదు. ఈ నాలుగేళ్లుగా ఈ కేసులో నిందితుడైన జనుపల్లి శ్రీను అనే యువకుడు రిమాండ్ ఖైదీగానే మగ్గిపోతున్నాడు. తనపై హత్యాయత్నం కేసు విచారణ పూర్తై నిందితుడికి శిక్ష పడాలన్న భావన జగన్ లో ఏ కోశానా కనిపించడం లేదు. అసలా సంఘటనే జరగలేదన్నట్లుగా ఆయన తీరు కనిపిస్తోంది. ఇక సొంత బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయాన్నే తీసుకుంటే.. అప్పట్లో అప్పటి అధికార పక్షమే ఈ దారుణానికి కారణమంటూ గగ్గోలు పెట్టిన జగన్.. విపక్ష నేతగా ఈ హత్య కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి హోదాలో సీబీఐ విచారణ అవసరం లేదన్నారు. కానీ వైఎస్ వివేకా కుమార్తె డాక్టర్ సునీత తన తండ్రి హంతకులకు శిక్ష పడాల్సిందేననీ, ఈ హత్య వెనుక పాత్రధారులు, సూత్రధారులు వెలుగులోనికి రావాల్సిందే అంటూ పట్టుబట్టి సీబీఐ దర్యాప్తును సాధించారు. ఆ తరువాత సీబీఐ దర్యాప్తునకు ఏపీలో అడుగడుగునా..అడ్డంకులు అవాంతరాలు కలగడంతో మళ్లీ సునీతే సుప్రీం ను ఆశ్రయించి కేసు విచారణను మరో రాష్ట్రానికి బదలీ చేయాలని కోరింది. సర్వోన్నత న్యాయస్థానానికి సీబీఐ కూడా సునీత చెప్పిన ప్రతి మాటా అక్షర సత్యమని నివేదించింది. దీంతో కేసు విచారణ తెలంగాణకు మారింది. అప్పటి నుంచీ దర్యాప్తులో వేగం పెరిగింది. కేసు దర్యాప్తు వేగంగా వివేకా హత్య వెనుక సూత్రధారులు, పాత్ర ధారులు ఎవరన్నది లేల్చే దిశగా సాగుతోందన్న అభిప్రాయమూ అందరిలో కలిగింది. సరిగ్గా ఈ తరుణంలో ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సీబీఐ దర్యాప్తు తీరు సరిగా లేదని ఆరోపిస్తూ, కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అరెస్టు చేయకుండా సీబీఐని ఆదేశించాలంటూ కోర్టుకు వెళ్లారు. ఆ సందర్భంగా ఈ హత్య వైఎస్ వివేకా అల్లుడే చేశాడంటూ ఆరోపించారు. సరే ఇదంతా కొద్ది సేపు పక్కన పెడితే..కోడికత్తి కేసు, వివేహా హత్య కేసు ఈ రెండిటి విషయంలో వైసీపీ వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ ప్రతిష్టను మసకబార్చిందనడంలో సందేహం లేదు. విపక్షంలో ఉన్న సమయంలో ఒకలా, అధికారంలోకి వచ్చాకా మరోలా వ్యవహరించడం వల్ల ఈ రెండు సంఘటనల్లో గతంలో జగన్ ఆరోపణలు వాస్తవాలు కావన్న అభిప్రాయం జనంలోకి బలంగా వెళ్లిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా సొంత బాబాయ్ వైఎస్ వివేకా హత్య విషయంలో విపక్షంలో ఉన్న సమయంలో అప్పటి అధికార పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, తెలుగుదేశం పార్టీపైనా విమర్శలు గుప్పించిన వైసీపీ ఇప్పుడు ఆయన హత్య వెనుక ఉన్నది తెలుగుదేశం కాదు, వివేకా కుటుంబ సభ్యులే అనడంతో వైసీపీ, జగన్ ల మాటలలో విశ్వసనీయత కరవైందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా వైఎస్ ఫ్యామిలీ ప్రతిష్ట మసకబారిందన్న భావన కలుగుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వైఎస్ జీవించి ఉన్న కాలంలో రామలక్ష్మణులకు ప్రతీకగా వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డిలను జనం చెప్పుకునే వారు.

అయితే వైఎస్ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన తరువాత నుంచీ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. వివేకానందరెడ్డి కాంగ్రెస్ లోనే ఉండటం, జగన్ వైసీపీ పార్టీ ప్రారంభించడం, ఆ తరువాత వివేకా వైసీపీలోకి వచ్చిన తరువాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆయన స్వయంగా పరాజయం పాలు కావడంతో వివేకా, జగన్ మధ్య విభేదాలున్నాయా అన్న అనుమానాలు అప్పట్లోనే పొడసూపాయి. ఇక వైఎస్ వివేకా హత్య, తదనంతర పరిణామాలు వైపీపీ ప్రతిష్ట మసకబార్చడమే కాకుండా, వైఎస్ ఫ్యామిలీ ప్రతిష్టను కూడా మసకబార్చాయంటున్నారు. వైఎస్సార్ ఫ్యామిలీ ప్రతిష్టకు భంగం వాటిల్లిందనీ చెబుతున్నారు. కేసు దర్యాప్తు ముందుకు సాగేకొద్దీ మరెన్ని విషయాలు బయటకు వస్తాయో అన్న అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.

# నాదెండ్ల కొందరి వాడేనా



గుంటూరు, మార్చి 14, అవును.. జనసేన క్యాడర్ లో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతుంది. సోషల్ మీడియాలో జనసేన కార్యకర్తలే తరచూ పోస్టులు చేస్తున్నారు. నాదెండ్లకు అంతా అప్పగించి సినిమాలు చేసుకుంటే ఎలా అన్నా అంటూ పవన్ ను ప్రాధేయపడుతూ పోస్టులు కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ జనసేన పార్టీ అధినేత అయినా పార్టీ వ్యవహారాలన్నీ నాదెండ్ల మనోహర్ మాత్రమే చూసుకుటున్నారు. జిల్లాల పర్యటనల దగ్గర నుంచి ముఖ్యమైన నేతలతో భేటీల వరకూ ఆయనే చూసుకుంటున్నారు. ఇది జనసేన పార్టీలోని ఎక్కువ మందికి రుచించడం లేదు. పైగా నాదెండ్ల మనోహర్ దగ్గరుండి తెలుగుదేశం పార్టీతో పొత్తు కుదరడానికి ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు కూడా ఆ పార్టీ నుంచే వినపడుతున్నాయి. నిజానికి నాదెండ్ల మనోహర్ మృదుస్వభావి. రాజకీయాలను రఫ్ గా చేయలేరన్న పేరుంది. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కూడా పెద్దగా వివాదంలో కనపడే వారు కాదు. తన తండ్రి నాదెండ్ల భాస్కరరావు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారే కాని, ఆయన ముద్ర, నీడ తన మీద పడకుండా తొలి నుంచి జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే మనోహర్ కు సౌమ్యుడిగా పేరుంది. నిజానికి ఆయన జనసేనలోకి వెళతారని ఎవరూ భావించలేదు. రాష్ట్ర విభజన జరిగిన వెంటనే నాదెండ్ల మనోహర్ తెలుగుదేశం లేదా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళతారని అందరూ అనుకున్నారు. ఆయన అందరి అంచనాలకు భిన్నంగా ఆయన జనసేన పార్టీలో చేరారు. పవన్ కల్యాణ్‌కు అత్యంత సన్నిహితుడిగా మారారు. పార్టీలో నెంబరు 2 నాదెండ్ల మాత్రమేనని చెప్పాలి. నాదెండ్ల చెబితేనే పవన్ వింటారన్న అభిప్రాయం కూడా పార్టీలో వ్యక్తమవుతుంది. అయితే అనేక మంది జనసేన నుంచి వెళ్లిపోవడానికి కూడా నాదెండ్ల మనోహర్ కారణమనే వారు లేకపోలేదు. తొలినాళ్లలో ఉన్న వాళ్లంతా పార్టీని వీడారు. అయినా నాదెండ్ల మాత్రం పవన్ వెంటే ఉన్నారు. పవన్ కూడా అంతా నమ్మి సర్వం నాదెండ్ల చేతిలో పెట్టారంటారు. ఆ సినిమాకు 7 ఆస్కార్ లు కొందరి వైపే... కన్నా లక్ష్మీనారాయణ, హరిరామ జోగయ్యలతో భేటీ బాధ్యతను కూడా నాదెండ్ల మనోహర్ కే అప్పగించారు. దీంతో ఆయన జిల్లాల పర్యటనలో కొందరిని మాత్రమే ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఏ పార్టీలోనైనా పదవుల కోసం, టిక్కెట్లు కోసం పలువురు పోటీ పడుతుంటారు. వారు పవన్ సభలకు, సమావేశాలకు హాజరవుతున్నా తమ ప్రాంతంలో ఎవరికి వారే కార్యక్రమాలు చేసుకుంటారు. జనసేనలో కూడా ఇది కొత్తేమీ కాదు. కానీ నాదెండ్ల ఒకవర్గం వైపే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే జనసేన పార్టీ కార్యకర్తల నుంచే నాదెండ్ల మనోహర్ వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు.

# ఫీవర్ సర్వే చేసిన వైద్యశాఖ

నెల్లూరు, మార్చి 14, దగ్గు, జలుబు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని గుర్తించి వారికి వైద్య సహాయం అందించడానికి సోమవారం నుంచి ఫీవర్ సర్వేను చేపట్టింది. ఈ మేరకు ఇప్పటికే అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖాధికారుల (డీఎంహెచ్‌వో)కు ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, గ్రామ, వార్డు వలంటీర్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రజలను స్క్రీనింగ్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశించింది.శీతాకాలం ముగిసి వేసవి ప్రారంభమవుతున్న క్రమంలో వాతావరణ మార్పులతో దగ్గు, జలుబు, వైరల్ జ్వరాలు దేశవ్యాప్తంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న సంగతి తెలిసిందే. ఇన్‌ఫ్లూయెంజా ఎ ఉపరకం హెచ్3ఎన్2 అనే వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతోందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ఇప్పటికే వెల్లడించింది. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సైతం రాష్ట్రాలకు ఇప్పటికే పలు మార్గదర్శకాలు జారీ చేసింది. హెచ్3ఎన్2 ఫ్లూ అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలు చేయడం కోసం టెస్టింగ్ కిట్‌లను వైద్య ఆరోగ్య శాఖ కొనుగోలు చేస్తోంది. రెండు రోజుల్లో అన్ని బోధనాస్పత్రులకు వీటిని పంపనుంది. ప్రస్తుతం తిరుపతి స్విమ్స్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో హెచ్3ఎన్2 నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇక్కడ జనవరిలో 12, ఫిబ్రవరిలో తొమ్మిది పాజిటివ్ కేసులను నిర్ధారించారు. అయితే ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.ఏటా సీజన్ మారుతున్న సమయంలో కేసులు కొంత పెరుగుతాయని అంటున్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ మొదలవుతుండటంతో అవే పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆస్పత్రులకు వస్తున్న బాధితులకు చాలా అరుదుగా మాత్రమే అడ్మిషన్ అవసరమవుతోందని చెబుతున్నారు. సాధారణంగా ఆస్పత్రులకు వచ్చే ఓపీల్లో 5 నుంచి 6 శాతం వరకు జ్వరం, దగ్గు, జలుబు వంటి కేసులే ఉంటాయని గుర్తు చేస్తున్నారు.

వైద్యులు సూచిస్తున్న జాగ్రత్తలు..

క్రమం తప్పకుండా చేతులను సబ్బుతో కడుక్కోవాలి.
ఫ్లూ లక్షణాలున్నవారు మాస్క్ ధరించాలి.
వీలైనంత ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి.
షేక్‌హ్యాండ్, ఆలింగనాలు మానుకోవాలి.
బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మకూడదు.

# దళిత, బహుజన విప్లవ నాయకుడు కాన్షి రాం

## నేడు ఆయన జయంతి

దేశ రాజకియాలలో పెను మార్పులు తెచ్చి బహుజనులకు రాజ్యాధికారం కల్పించి భారత దేశ రాజకీయ చిత్ర పటాన్ని మార్చిన ఘనత కాన్షి రాం కు దక్కుతుంది. కాన్షి రాం చనిపొయి దశాబ్దం గడిచినది కాని బహుజన నాయుకుడిగా దేశ రాజకీయాలపై అతను ప్రసరించిన ప్రభావంను అతని అనుచరులు, సమర్ధకులు చివరికి అతని వ్యతిరేకులు కూడా విస్మరించ జాలరు. కాన్షి రాం ఉత్తర భారత దేశం లో బహుజనులు-దళితుల, వెనుక బడిన, అణగారిన వర్గాల తిరుగు లేని నాయకుడు. అతడు తన జీవితాంతం పై వర్గాల రాజకీయ అధికార ప్రాప్తి కోసం రాజి లేని పోరాటం సాగించినాడు. చిన్న తనం నుండి సమాజ మార్పు కోసం, రాజకీయాలలో అధికార మార్పు కోసం కంకణం దాల్చినాడు. సైకిల్ పై విస్తృతం గా దేశ వ్యాప్తం గా పర్యటించి బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయం ను ప్రచారం చేసి దళితులకు రాజకియ అదికారం కోసం పాటు పడ్డాడు. కాన్షి రామ్ మొదట్లో డీఎస్4, బీఏయంసిఈఎఫ్ తరువాత బహుజన సమాజ పార్టి ని స్థాపించి నాడు. ఆ తరువాత మాయావతి దానికి నాయకత్వం వహించి ఉత్తర ప్రదేశ్ కుల రాజకీయాలను కూకటి వేళ్ళతో ద్వంసం చేసి ముఖ్య మంత్రి అయినది. పంజాబ్ లో జన్మించిన శ్రీ కాన్షి రాం ఉత్తర ప్రదేశ్ ను తన రాజకీయ కేంద్రం గా నిర్ణయినీచుకొన్నారు. ఇతర దళిత నాయకుల వలే కాంగ్రెస్ మరి ఎ ఇతర రాజకీయ పక్షానికి దాసోహం అనలేదు. సంపద, వివాహం, ఇంటిని విడిచి పులే-అంబేద్కర్ ఆశయాల సాధన కొరకు తన జీవితం ను అంకితం చేసిన ధీశాలి శ్రీ కాన్షి రాం . దళితులకు శతాబ్దాల వారిగా జరుగుతున్న అన్యాయం, అసమానతల పట్ల కాన్షిరాం తన అసంతృప్తిని, బాధ ను ఆక్రోశం వేల్లుబుచ్చారు. తిలక్,తరాజు ఔర్ తల్వార్ కో మారో అనే నినాదం అగ్రవర్ణాల వారిని కోపానికి గురిచేసింది. కాని కాన్షి రామ్ తన ప్రచారం చేత బహుజన సమాజ్ పార్టి ని దేశ ప్రధాన రాజకీయ పక్షం గా నిలబెట్టారు. మొదట్లో సమాజ్ వాది పార్టి తో పిదప కాంగ్రెస్ తో జత కట్టి బ.స.పా ఉత్తర ప్రదేశ్ లో దళితుల పాలిటి అతి ముఖ్యమైన రాజకీయ పార్టి గా అవతరించినది. ముస్లిం ల సమర్ధన కుడా పొందినది. కుల రాజకీయాలు ఎక్కువగా ఉన్న సామజిక అసమానతలు అధికం గా గల ఉత్తర ప్రదేశ్ లో బ.స.పా. అధికారం లోకి రావడం తో దళితులకు రాజకీయ అధికారం లబించినది. అతని శిష్యురాలు బహెన్ మాయావతి యు.పి. లో రెండు సార్లు ముఖ్య మంత్రి పదవిని పొందినారు.బహుజన సమాజ్ పార్టీ నిర్మాత. రామదాసియా శిక్కు చమార్ కులస్తులైన తేల్సింగ్, బిషన్సింగ్ కౌర్ లకు .మార్చి 15, 1934 పంజాబ్ రాష్ట్రంలో రోపార్ జిల్లా కావాస్పూర్ గ్రామంలోజన్మించాడు. జ్యోతిరావుపూలే, ఛత్రపతి సాహు మహరాజ్, పెరియార్ ఇ.వి. రామస్వామి నాయకర్, నారాయణగురు, అంబేద్కర్ ల ప్రబోధాలను రాజ్యాధికారం వైపు నడిపి విజయాలు సాధించాడు. తన 31వ ఏటనే అంబేద్కర్ రచించిన 'కుల నిర్మూలన ' గ్రంథం ద్వారా ప్రేరేపితుడయ్యాడు. తన తల్లికి ముప్పై పేజీల ఉత్తరం రాస్తూ 'ఇక నుంచి నేను కుటుంబ బాంధవ్యాలను తెంచుకుంటున్నాను. నా కోసం మీరు వెతకవద్దు' అంటూ బయటికి వెళ్లి, చనిపోయే వరకు తిరిగి ఇంటికి వెళ్లలేదు. 1984 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించాడు. ఒక ఓటు-ఒక నోటు అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారిచ్చే డబ్బుతోనే ప్రచారం చేశాడు. కులాన్ని నిర్మూలిద్దాం-బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాడు. నువ్వు 85 శాతం ఉండగా 15 శాతం మీద ఎందుకు ఆధారపడతావు? నడువు పార్లమెంటు, అసెంబ్లీకి నడువు. నీ కాళ్లమీద నీవే నడువు అంటూ బహుజనులను ఉసిగొల్పాడు. ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి. ప్రజల భూమి మీద ప్రజలకు హక్కులేదా? అనేవాడు. కులాన్ని కులంతోనే జయించాలని కులాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకున్నాడు. యూపిలోని చమార్లనే పునాదిగా చేసుకొని పంజాబ్, హర్యానా, ఢిల్లీ, కాశ్మీర్, బీహార్, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ లలో ఇతర కులాలను కలుపుకొని పార్టీని బలోపేతం చేశాడు. మాయావతిని ముఖ్యమంత్రిగా చేశాడు. 1984లో ప్రారంభమైన బిఎస్పి 1996 నాటికి జాతీయ పార్టీగా ఎదిగింది. 2006 అక్టోబరు 9న కాన్షీరాం మరణించాడు. భారత దేశ దళిత చరిత్ర లో కాన్షి రామ్ బహుజనులకు రాజ్యాధికార సాధన లో సాధించిన విజయం మరుపు రానిది.

# చాపకింద నీరులా గంజాయి రవాణా

**- నియోజవర్గం వ్యాప్తంగా జోరుగా కొనసాగుతున్న విక్రయాలు**
**- యువతలో మత్తులో ముంచేస్తున్న వైనం**

చొప్పదండి నిషేదిత మాదకద్రవ్యాల సప్లై తెలంగాణలో చాపకింద నీరులా జరుగుతోంది. నిన్నటి వరకు క్వింటాళ్లు, టన్నుల్లో గంజాయిని సప్లై చేస్తూ పోలీసుల కళ్లలో పడుతుండటంతో స్మగ్లర్లు కొత్త రూట్ ఎంచుకున్నారు. స్మాల్ ప్యాక్ల రూపంలో అవసరమైన ప్రతి చోట సప్లై చేసేలా ఈ గంజాయి స్మగ్లింగ్ను ఓ చైన్ బిజినెస్లా మార్చుకున్నారు.గంజాయి అక్రమ రవాణా ముఠాలు తమ స్టైల్ మార్చాయా..? యువతను టార్గెట్ చేస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నాయా..? దీనికోసం టీనేజి యూత్ను వినియోగిస్తున్నారా..? స్మాల్ ప్యాకర్స్, మూవర్స్, సెల్లర్స్గా అమాయక యువత బలవుతున్నారా... అంటే నిజమన్నట్టే ఇన్పుట్స్ ఉన్నాయి. వారం రోజుల క్రితం కరీంనగర్ పట్టణంలో పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా యువకుల వద్ద నుంచి 2కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరు..? ఎక్కడి నుంచి తెస్తున్నాడు.. ఎవరికోసం రవాణా చేస్తున్నాడు.. ఇవన్నీ విచారణలో తెలుసుకున్న పోలీసులు నివ్వెరపోయారు. ఇంజనీరింగ్ , మెడిసిన్ , ఇంటర్ , పదవ తరగతి విద్యార్థులు సైతం ఈ వ్యసనానికి బానిస అవుతున్నట్లు గుర్తించారు.

తల్లిదండ్రులే కారణమా ?

తల్లిదండ్రుల పెంపకలోపంతోనే పిల్లలు మద్యానికి ధూమపానానికి మత్తుకు బానిస అవుతున్నట్లు తెలుస్తుంది. వేలల్లో పాకెట్ మనీ ఇవ్వడం ఒక కారణం. రాత్రి వేళల్లో తరచుగా బయటికి వస్తూ బైక్ రేసింగ్ లు , ఓవర్ స్పీడ్ , యాక్సిడెంట్ చేయడం వంటివి జరుగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో మైనర్లు సైతం మత్తుకు బానిసవుతున్నట్లు సమాచారం.

యువతే టార్గెట్

నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల్లో గంజాయి సునాయాసంగా మారింది. స్థానికంగా యువతను ఫోకస్ చేస్తూ అమ్ముతున్నట్లు ప్రజలు విమర్శలు చేస్తున్నారు.యువత నిత్యం మత్తుతో ఊగిపోతున్నారు. పేరు మోసిన కాలేజీల బయట జోగుతున్నారు. రైల్వేస్టేషన్లు, హైవేలపై యదేచ్ఛగా గంజాయి దందా నడుస్తోంది. గంజాయి ఇచ్చే మత్తుతో ఎవరు ఏం చేస్తున్నారో, ఎలా ప్రవర్తిస్తున్నారో తాజాగా నమోదవుతన్న కేసులే ఉదాహరణ అవుతున్నాయి. ఫోన్ చేస్తే చాలు నేరుగా గంజాయి ప్యాకెట్ని చేతికే తీసుకొచ్చి ఇవ్వడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఇకనైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# రైస్ మిల్లు యజమానిపై ఫిర్యాదు

నర్సాపూర్ మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని ఒక రైస్ మిల్ యజమాని రైస్ మిల్ అసోసియేషన్ వారిపై పౌరసరఫరాల శాఖ అధికారిపై. జాయింట్ కలెక్టర్ లను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని జిల్లా కలెక్టర్. జిల్లా ఎస్పీ లకు మెదక్ జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేసారు. రైస్ మిల్ అసోసియేషన్ నాయకుడు చంద్రపాల్ మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణానికి చెందిన ఒక వ్యక్తి రైస్ మిల్లను లీజుకు తీసుకొని నడిపించుకుంటున్నాడన్నారు. మనకు వచ్చే దాన్యం దిగుమతి వస్తుందో దానికి కార్పొరేషన్ కు మనం ఎంత బియ్యం ఇయ్యాలో అనేది నిష్పత్తి ప్రకారం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏ ఒక్క రైస్ మిల్లర్ కి గాని ప్రాధాన్యత ఇవ్వకూడదని అందరినీ సమానంగా చూడాలన్నారు. అలాంటివే జిల్లాలోని అందరం అన్ని రైస్ మిల్ల వారు సహకరిస్తే ఇతను మాత్రం తన సొంత పంతం నెగ్గించుకోవడానికి బీహార్ హమాలీలతో మమ్మల్ని అధికారులను చంపిస్త మనీ ఆయన వాయిస్ రికార్డులు వైరల్ చేస్తున్నాడని అన్నారు. ఇతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ వినతిపత్రం ఇచ్చామన్నారు.

# ఘనంగా శ్రీ సత్తెమ్మ తల్లి వార్షిక జాతర

## పొలిమేర దేవతకు విశేష పూజలు
## అన్నసంతర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు

సింహచలం, మార్చి14సింహాద్రినాథుడి సొదరి, అడవివరం శ్రీనివాస్ నగర్ పరిసర 14 గ్రామాల ప్రజల పొలిమేర దేవతగా విరాజిల్లుతున్న శ్రీ సత్తెమ్మతల్లి మరిడిమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా మార్చి14న అమ్మవారి పుట్టినరోజు నేపధ్యంలో ఈ జాతరను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తు వస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, ఆరాధన నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం క్యూలైన్లలో ఉన్న భక్తులకు దర్శనం కల్పించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. సింహచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వేంకటరావు ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం బలిరెడ్డి చినఅప్పారావు కుటుంబ సభ్యుల సహకారంతో వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. దాతల సహకారంతో ప్రసాదాలు, మజ్జిగ, రస్నా కౌంటర్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆలరించాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా ఆలంకరించారు. భారీగా విద్యుత్ దీపాలంకరణ చేయగా, పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి జాతరలో పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నగర మేయర్ దంపతులుసత్తెమ్మ తల్లి, మరిడిమాంబ అమ్మవారి వార్షిక జాతర సందర్భంగా నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు, స్థానిక 93వ వార్డు కార్పోరేటర్. రాపర్తి కన్నా, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు సభ్యులు గంట్ల కనకరాజు,బలిరెడ్డి శ్రీనివాసరావు, స్థానిక నేతలు కర్రి పైడిరాజు, గంట్ల కిరణ్బాబు తదితరులు పాల్గొని, మేయర్ దంపతులను సత్కరించారు.

# గ్యాస్ మంటల నుండి రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలి

## - సీపీఐ నాయకులు డిమాండ్

నంద్యాల రాష్ట్ర బడ్జెట్లో ప్రజా కార్మిక కర్షక రైతులకు ఉపయోగపడే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు, పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నెలకు గ్యాస్ సిలిండర్ పై 300 రూపాయలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. 2023 2024 ఆర్థిక సంవత్సరానికి 126 కోట్ల నిధులను పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎస్ రంగస్వామి గారు ప్రకటించి సంచలనమైన నిర్ణయం తీసుకున్నారు. అలాగే మన రాష్ట్రంలో మంగళవారం నుండి జరిగే బడ్జెట్ సమావేశంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న వంటగ్యాస్ మంటలనుండి రాష్ట్ర ప్రభుత్వం కాపాడి వంట గ్యాస్ సిలిండర్ పై సబ్సిడీకి నిధులు కేటాయించాలని అన్నారు.

# పవన్ సభలో ఏం చెబుతారో ముందే చెబుతా...

విజయవాడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోని కాపు నేతలను బూతులు తిట్టటానికే పవన్ సభ పెడుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ పేరుకు మాత్రమేనని, అక్కడ జరిగేది దూషణల సభ అని వెల్లడించారు.జనసేన సభ కేవలం చంద్రబాబు, పవన్ తస్మదీయ దూషణల సభ మాత్రమేనని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. మనం ఏం చేశాం... మనలో లోపాలేంటి అనేది చర్చించుకోవడం రాజకీయ పార్టీ లక్షణమని అయితే అందుకు భిన్నంగా జనసేన ఆవిర్భావ సభ ఉంటుందని ముందుగానే చెప్పారు.చంద్రబాబు సేవ కోసమే పవన్ రాజకీయ పార్టీ పెట్టారని వ్యాఖ్యానించారు పేర్నినాని. తన పార్టీని అభిమానించే వారందరినీ చంద్రబాబుకు ఓటేయమని పవన్ చెబుతున్నారని అన్నారు. చంద్రబాబు మేలు కోసమే పవన్ పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటం సభకు మచిలీపట్నం సభకు పెద్ద తేడా ఉండదన్నారు. జగన్ మోహన్ రెడ్డిని తనను, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోని ఇతర కాపు నాయకులను దూషించడమే పవన్ పని అని తెలిపారు. మచిలీపట్నం సభలో జరగబోయేది ఇదే అంటూ పేర్ని నాని సెటైర్లు వేశారు. మచిలీపట్నంలో జరగబోయేది ఆవిర్భావసభ కాదు అస్మదీయ దూషణ సభ అని కాపులను చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టడానికే పవన్ తాపత్రయమని వ్యాఖ్యానించారు పేర్ని నాని. పవన్ ఎప్పటికీ మారడని కౌంటర్ ఇచ్చారు. సినిమాలు ఫ్లాప్ అయితే నష్టాలొస్తాయని,కానీ ఫ్లాప్ అయిన సినిమాకు కూడా పవన్కు లాభాలొచ్చేది ఇక్కడేనని ఎద్దేవా చేశారు. ప్యాకేజ్ స్టార్ అంటే పవన్కు కోపం వస్తుందని, అయితే ఏబీఎన్ రాధాకృష్ణ వెయ్యికోట్ల స్టార్ ప్యాకేజ్ అంటే ఆనందపడుతున్నారని నాని వ్యాఖ్యానించారు.పవన్ కల్యాణ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో ఎవరిపై విమర్శలు చేస్తారో, ఎవరిని టార్గెట్ చేసి మాట్లాడతారో తనకు ముందే తెలుసని నాని వ్యాఖ్యానించారు. పవన్ టార్గెట్ జగన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని, తెలుగుదేశాన్ని కాపాడుకునేందుకు పవన్ అన్ని ప్రయత్నాలు చేస్తారని అన్నారు. పవన్ ఇలాంటి రాజకీయాలు చేస్తున్నందునే ప్రజలు గుర్తించటం లేదని వ్యాఖ్యానించారు. పవన్ తన సిద్ధంతాలను గురించి, పార్టీ భవిష్యత్ కార్యచరణ, వచ్చే ఎన్నికల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు, ప్రజలకు ఏం చేస్తారో చెబితే బాగుంటుందని నాని వ్యాఖ్యానించారు.మాజీ మంత్రి పేర్ని నాని సొంత నియోజకవర్గంలోనే పవన్ సభ పెడుతున్నారు. దీంతో రాజకీయంగా ఈ వ్యవహారంపైనే టాపిక్ నడుస్తోంది. మొదటి నుంచి పవన్ను టార్గెట్ చేస్తూ ఇష్టానుసారంగా కామెంట్స్ చేసిన పేర్ని నాని పై జనసేన నాయకులు,కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు.

# కారు రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

## ముగ్గురు పరిస్థితి విషమం

పూతలపట్టు మంగళవారం ఉదయం పూతలపట్టు మండలం పాలకూరు జాతీయ రహదారిలో దుర్ఘటన జరిగింది.ముందు వెళుతున్న కారును ఒక లారీ ఢీకొంది. ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా బెంగళూర్ వాస్తవ్యులు. రు తిరుమల దర్శనం తరువాత బెంగళూరుకి తిరిగి వెళుతుండగా ఘటన జరిగింది. గాయపడ్డ వారిని హుటా హుటిన 108 లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వార్ల సేవలో విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తర పీఠాధిపతి





నంద్యాల మార్చి14 , నంద్యాల,జిల్లా శ్రీశైలం ప్రతినిధి:శ్రీశైలంలో శ్రీ స్వామి అమ్మవార్లను శ్రీ శారదా పీఠం ఉత్తర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సత్య నందేంద్ర సరస్వతి స్వామి వారు మంగళవారం సందర్శించారు. మంగళవారం ఉదయం ఆలయానికి చేరుకున్న పీఠాధిపతి వారికి ఆలయ రాజగోపురం వద్ద కార్యనిర్వాహణాధికారి ఎస్ లవన్న, ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు ,వేద పండితులు, పలువురు అధికారులు సాంప్రదాయ భద్దంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి అభిషేకం జరిపించుకున్న పీఠాధిపతులు శ్రీ భ్రమరాంబ అమ్మవారినీ దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాద మండపం లో ఉత్తరాధికారి వారి గౌరవార్థం దేవస్థానం వేద గోష్టి నిర్వహించారు. అనంతరం వారిని దేవస్థానం వారు సత్కరించారు.

### వంట గ్యాస్ ధర తగ్గించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలి:-సిపిఐ

నంద్యాల మార్చి14 , నంద్యాల నేటి నుండి అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్లో ప్రజా కార్మిక కర్షక రైతులకు ఉపయోగపడే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు పుదుచ్చేరి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల కష్టాలు తెలుసుకొని రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నెలకు ఒక గ్యాస్ సిలిండర్ పై 300 రూపాయలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది 2023 2024 ఆర్థిక సంవత్సరానికి 126 కోట్ల నిధులను పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎస్ రంగస్వామి గారు ప్రకటించి సంచలనమైన నిర్ణయం తీసుకున్నాడు అదేవిధంగా మన రాష్ట్రంలో ఈరోజు నుండి జరిగే బడ్జెట్ సమావేశంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న వంటగ్యాస్ మంటలనుండి రాష్ట్ర ప్రభుత్వం కాపాడి వంట గ్యాస్ సిలిండర్ పై సబ్సిడీకి నిధులు కేటాయించాలని అన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నిర్వహించే కౌంటింగ్ లో పొరపాట్లు జరగకుండా కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించండి



### జాయింట్ కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి

కర్నూలు,మార్చి14 :- స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియ లో పొరపాట్లు జరగకుండ సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి గారు కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం నగరంలోని చాణిక్యపురి కాలనీ లోని ఉద్యానభవన్ నందు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందికి జరిగిన రెండవ విడత శిక్షణా కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి మరియు సంయుక్త కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి గారు, పాల్గొన్నారు.జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం వారి ఎన్నికల నియమావళి పై రూపొందించిన మాన్యువల్ ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని పూర్తి అవగాహనను ఏర్పరుచుకోవాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 6 పోలింగ్ కేంద్రాల ద్వారా ఈ నెల 13 వ తేదీ సోమవారం ఎన్నికలు నిర్వహించడం జరిగిందని ఇందుకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్ ను కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ కి సంబంధించి ప్రతి అభ్యర్థి ఒక కౌంటింగ్ ఏజెంట్ ని నియమించుకోవచ్చన్నారు..కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ సమయంలో వాలిడ్ మరియు ఇన్ వాలిడ్ బ్యాలెట్ పేపర్ ను జాగ్రత్తగా గమనించి కౌంటింగ్ నిర్వహించాలని ఆదేశించారు.జడ్పీ సీఈవో మరియు మాస్టర్ ట్రైనర్ నాసర రెడ్డి మాట్లాడుతూ శాసనమండలి ఓట్ల లెక్కింపుప్రక్రియ కు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా అవగాహన కల్పిస్తూ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు కు ఏర్పా టు చేసిన ప్రతి టేబు ల్ కు సిబ్బంది ఉంటారని, కౌంటింగ్ పర్సనల్స్ కౌంటింగ్ కేంద్రంలోనికి పెన్ను ను తీసుకొని వెళ్ళడానికిఅనుమతి లేదని తెలిపారు.. ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రాధమికం గా మొదట పోస్టల్ బ్యాలెట్ అనంతరం బ్యాలెట్ పేపర్లను కట్టగా కట్టి పోలింగ్ స్టేషన్ ల వారీ గా ట్రేలో వెయ్యాలని తరు వాత పోస్టల్ బ్యాలె ట్ పేపర్లు మరియు పోలింగ్ స్టేషన్స్ వారీ గా కట్టలు కట్టిన బ్యాలెట్ పేపర్లు ను మొత్తం కలిపి అభ్య ర్థుల వారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు.కౌంటింగ్ మాన్యు వల్ లోని ప్రతి లైన్ ను క్షుణ్ణంగా చదివి కౌంటింగ్ పర్సనల్స్ అర్థం చేసుకోవాలని తెలిపారు..

## విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వని రాష్ట్ర బడ్జెట్లో ఎన్ ఎస్ యు ఐ

ఎమ్మిగనూరు:--ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో జరుగుతున్న మూడవ వార్షిక బడ్జెట్లో విద్య రంగానికి పూర్తిగా ప్రాదన్నత ఇవ్వలేదని , విద్యారంగానికి ఏ ఒక్క సారి కూడా ప్రాధాన్యత ప్రవేశపెట్టకపోవడం చాలా సిగ్గుచేటని ఔజఎ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ మంగళవారం స్థానికంగా మాట్లాడుతూ విద్యారంగానికి, నిరుద్యోగులకు పాదయాత్ర సమయంలో అనేక హామీలు ఇచ్చినప్పటికీ యువతకు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని జాబ్ క్యాలెండర్ పై మాట తప్పిన రాష్ట్ర ప్రభుత్వమని తెలిపారు. ఈ సంవత్సరం ప్రవేశపడుతున్న బడ్జెట్లో యూనివర్సిటీలకు , ఉద్యోగులకు అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేసేందుకు



అసెంబ్లీలో ఆర్థిక శాఖకు ఆమోదం పంపాలని డిమాండ్ చేశారు. పేద బడుగు బలహీన వర్గాల చదువుకు అన్ని కోర్సులకు ఫీజు రియంబర్స్మెంట్ కల్పించాలని తెలిపారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టంపై ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్ అధిక నిధులు కేటాయించాలన్నారు.

## జర్నలిస్టులు ఆరోగ్యవంతంగా ఉండాలి, నిత్యం వైద్య పరీక్షలు చేయించుకోవాలి



### జా ప్ జర్నలిస్టు వైద్య శిబిరంలో జర్నలిస్టులు, వైద్యుల పిలుపు

కర్నూలు మార్చి 13 జర్నలిస్టులు ఆరోగ్యవంతంగా ఉంటేనే సమాజానికి ఆరోగ్యకరమైన వార్తలు అందించగలుగుతారని పలువురు సీనియర్ జర్నలిస్టులు ,ప్రముఖ వైద్యులు అభిప్రాయపడ్డారు .నిత్యం వార్తా సేకరణలో ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు .మంగళవారం కర్నూలు సమాచార భవన్ ఆవరణంలో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ జా ప్ ఆధ్వర్యంలో అమీలి యో హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల ఉచిత వైద్యశిబిరానికి పలువురు సీనియర్ జర్నలిస్టులు ,ప్రముఖ వైద్యులు హాజరయ్యారు .ఈ సందర్భంగా అమిలి యో హాస్పిటల్ ఎండి లక్ష్మీప్రసాద్ ,జా ప్ జిల్లా గౌరవాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, గౌరవ సలహాదారులు టి. విజయ్ ,జా ప్ జిల్లా అధ్యక్షులు తుగ్గలి శ్రీనివాస్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. అమిలి యో హాస్పిటల్ కు చెందిన ప్రముఖ, నిష్ణాతులైన వైద్యులు హాజరై జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా బిపి, షుగర్ ,ఈసీజీ, గుండె సంబంధిత 2ట ఎ కో,కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ,ఉచితంగా మందులను అందజేశారు.ఈ సందర్భంగా అమీ లియో హాస్పిటల్ ఎండి డా.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అమీ లియో హాస్పిటల్ లో ఉచితంగా ఓపివైద్య సేవలు అందిస్తామని చెప్పారు .ప్రతి జర్నలిస్టు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యం గా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జా ప్ జిల్లా గౌరవ అధ్యక్షులు అబ్దుల్ సత్తార్ ,గౌరవ సలహాదారులు టి విజయ్, జా ప్ కర్నూలు జిల్లా అధ్యక్షులు తుగ్గలి శ్రీనివాస గౌడ్ ?ట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే జా ప్ లక్ష్యమని చెప్పారు .విధి నిర్వహణలో ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండా లనే ఉద్దేశంతో జా ప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు .నిరంతరం జర్నలిస్టు సంక్షేమ కార్యక్రమాలు చేస్తూనే ఉంటామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్జన్ డాక్టర్ గౌరప్ప,



అసిస్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ యశోద ,అసిస్టెంట్ ఆప్తల మాలజిస్ట్ డాక్టర్ షహిస్తా షరావత్, ఏజీఎం విష్ణువర్ధన్ రెడ్డి, 2ట ఎకో టెక్నీషియన్ శిరీష, పిఆర్వో వరప్రసాద్ తో పాటు అమిలియా హాస్పిటల్ సిబ్బంది హాజరై, జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## కోరలు కూడా పీకి దిగొచ్చేలా చేసే సత్తా ఉన్నోడు!

తెలుగు సినిమా 'ఆర్ ఆర్ ఆర్' అందులో పాట'నాటు నాటు'కు ఆస్కార్ రావడంతో? బాలీవుడ్ ఏ రేంజ్ లో కుళ్లు కుంటుందో వాళ్లమౌనమే చెప్పేస్తుంది. ఈర్ష్య భావంతో రగిలిపోతుందని చెప్పడానికి ఇదొక మంచి ఉదాహరణ. పరిమితంగా వచ్చిన ట్వీట్లు చూస్తే హిందీ వోళ్లు! ఎలా సల సలా కాగిపోతున్నారో?



తెలిసిపోతుంది. ఈ సంగతి మనోళ్లకి అర్థం కావడానికి ఇంత సమయం పట్టింది. వాస్తవానికి 'బాహుబలి' సినిమా పాన్ ఇండియాని దాటి..గ్లోబల్ స్థాయిలో రికార్డులు నమోదు చేయడంతోనే బాలీవుడ్ నుంచి ఏడుపు మొదలైంది.అటుపై 'ఆర్ ఆర్ ఆర్'..'పుష్ప-2'..'కార్తికేయ-2'..'కేజీఎఫ్-2' లాంటి సినిమాలు పాన్ ఇండియాలో దుమ్ము రేపడంతో సీన్ మరింత వెడెక్కింది. ఇప్పుడు ఏకంగా 'ఆర్ ఆర్ ఆర్' కి ఆస్కార్ గౌరవమే దక్కడంతో? బాలీవుడ్ కిక్కిరిమనలేదు. ఈ విజయాలతోనే రాజమౌళి బాలీవుడ్ మెడలు వంచేసాడు. ఇండియన్ సినిమా అంటే బాలీవుడ్ సినిమా ఒక్కటే అని చెప్పుకుని విర్రవీగేవారంతా టాలీవుడ్ కి పరిగెత్తుకు రావడాన్ని ఏమని చెప్పాలి? అందుకు సమాధానం బాలీవుడ్ పెద్దల్ని అడిగితేనే కరెక్ట్ గా చెబుతారు.ఆ రకంగా బాలీవుడ్ దూకుడుకు కళ్లెం వేసారు. ఇక అదే పరిశ్రమకి జక్కన్న కోరలు కూడా పీకడమే ఆలస్యం. అందుకు కూడా ఎంతో సమయం లేదు. ఇప్పుడు ఏకంగా సూపర్ స్టార్ మహేష్ తో ఓ గ్లోబల్ మూవీనే ప్లాన్ చేస్తున్నారు. ఆఫ్రికన్ అడవుల్లో సాగే భారీ యాక్షన్ థ్రిల్లర్ గా ప్రేక్షకులు ముందుకు తీసుకురానున్నారు. ఇండియన్ స్క్రీన్ పై ఇప్పటివరకూ ఇలాంటి నేపథ్యంలో సినిమా రాలేదు.హీరోని ఆ రేంజ్ లో ఎలివేట్ చేసిన దర్శకుడు లేడు. మహేష్ ని ఈ కథకి లాక్ చేయడం వెనుక ఇంకా బలమైన కారణాలెన్నో ఉన్నాయి. హాలవుడ్ కి వెళ్లకుండా హాలీవుడ్ హీరో రేంజ్ లో ఫేమస్ అయిన ఇండియన్ సినిమా నటుడాయన. సరిగ్గా అదే పాయిట్ ని బేస్ చేసుకుని జక్కన్న మహేష్ ని రంగంలోకి దించుతున్నారు.ఈ సినిమా తర్వాత రాజమౌళి హాలీవుడ్ లోనే సినిమాలు చేసే అవకాశం ఉంటుంది. 'ఆర్ ఆర్ ఆర్' సినిమాతోనే రామ్ చరణ్ కి హాలీవుడ్ ఛాన్సులు క్యూలో నిలిచాయి. ఇక మహేష్ గురించి చెప్పేదేం లేదు. చూడటం తప్పు! ఇప్పటికే దేశం గర్వించదగ్గ దర్శకుడయ్యాడు..ఆ తర్వాత అంతకు మించి అనడంలో అతిశయోక్తి లేదు. అప్పుడా పరిశ్రమ కి ఉన్నదంతా దిగిపోతుంది.

## మరో బాలీవుడ్ బ్యూటీతో చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కి ఆర్ఆర్ఆర్ సినిమా ఆస్కార్ ఎంట్రీతోనే గ్లోబల్ స్టార్ అనే గుర్తింపు వచ్చేసింది. జేమ్స్ కామెరూన్ లాంటి లెజెండరీ



దర్శకుడు ఏకంగా రామ్ చరణ్ పెర్ఫార్మెన్స్ కి ఫిదా అయిపోయారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ మీడియా చానల్స్ లో చరణ్ ఇంటర్వ్యూలు ఇచ్చారు. త్వరలో ఒక హాలీవుడ్ ప్రాజెక్ట్ కూడా ఉంటుందని కన్ఫర్మ్ చేశారు. మొత్తానికి రామ్ చరణ్ ఇమేజ్ ఇప్పుడు టాలీవుడ్ లో ఆకాశం అంత ఎత్తులో ఉంది.ఒకప్పుడు నెపో కిడ్ అంటూ విమర్శలు చేసిన అందరి నోళ్ళు మూయిస్తూ మెగాస్టార్ చిరంజీవి ఇమేజ్ ని సైతం దాటుకొని వెళ్ళిపోయాడు. మెగాస్టార్ చిరంజీవి చరిష్మాతోనే హీరోగా ఎంట్రీ ఇచ్చిన తనకంటూ ఒక యునిక్ స్టైల్ ని రామ్ చరణ్ ఏర్పరుచుకున్నారు.రంగస్థలం సినిమాతోనే చెర్రి నట విశ్వరూపం చూపించారు. ఇక ఆర్ఆర్ఆర్ లో అయితే ఎమోషన్స్ అద్భుతంగా ఆవిష్కరించారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం హాలీవుడ్ లెవల్ లో రామ్ చరణ్ కి గ్రేట్ రెస్పెక్ట్ దొరుకుతుంది.తాజాగా ఆస్కార్ వేడుకలలో రామ్ చరణ్ భార్య ఉపాసనతో కలిసి పాల్గొన్న సంగతి తెలిసిందే. అందులో చెర్రి స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలబడ్డారు. ఇదిలా ఉంటే రామ్ చరణ్ లాస్ ఏంజిల్స్ ఆస్కార్ అవార్డుల థియేటర్స్ లో ప్రత్యేకంగా సందడి చేశారు. ఈ సందర్భంగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకునేతో రామ్ చరణ్ ఫోటోలకి ఫోజులు ఇవ్వడం విశేషం. ఇప్పుడు ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.ఇదిలా ఉంటే నాటు నాటు పాటని రిప్రజెంట్ చేసే సమయంలో దీపికా పదుకునే స్టేజ్ మీద ఉద్వేగానికి గురి కావడం విశేషం. ఒక ఇండియన్ సినిమాని పరిచయం చేస్తూ ఉండటంతో పాటు నాటు నాటు పాటకి గ్లోబల్ ఇమేజ్ రావడంతో ఆడిటోరియంలో ఫుల్ సందడి ఏర్పడింది.ఈ సందర్భంగా దీపికా పదుకునే ఇండియా నుంచి ఆస్కార్ కి బెస్ట్ ఒరిజినల్ కేటగిరీలో నామినేట్ అయిన మొట్టమొదటి సాంగ్ అంటూ నాటు నాటు గురించి రిప్రజెంట్ చేసింది. ఇప్పుడు ఈ వీడియో కూడా వైరల్ అయ్యింది.

## పజిల్ డీకోడ్ చేయమంటున్న సాయిధరమ్ తేజ్



చివరిగా రిపబ్లిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఆకట్టుకునే ప్రయత్నం చేసిన సాయి ధరమ్ తేజ్ చాలా గ్యాప్ తర్వాత విరూపాక్ష అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. సాయిధరమ్ తేజ్ హీరోగా సంయుక్త మీనన్ హీరోయిన్ గా తెరకెక్కుతున్న విరూపాక్ష సినిమాని కొత్త డైరెక్టర్ కార్తీక్ వర్మ తెరకెక్కిస్తున్నారు.కార్తీక్ వర్మ దర్శకత్వంలో ఈ సినిమా ఒక యాక్షన్ థ్రిల్లర్ గా తెరెక్కుతుంది. శ్రీ వెంకటేశ్వర చిత్ర ఎల్ఎల్పి సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ల మీద ఈ సినిమా సంయుక్తంగా నిర్మితమవుతోంది.ఈ సినిమా త్వరలోనే విడుదలకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో సినిమాకి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలను సినిమా యూనిట్ శరవేగంగా జరుపుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్ సినిమా మీద ఆసక్తి పెంచగా ఇప్పుడు మరో ఆసక్తికరమైన అప్డేట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది.విరూపాక్ష టీం వాస్తవానికి ఈ సినిమా ఏప్రిల్ 21 2023 వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. రిలీజ్ కి దగ్గర పడటం ఉండడంతో సినిమా యూనిట్ పెద్ద ఎత్తున ప్రమోషన్ జరుగుతోంది.తాజాగా ఒక పోస్టర్ ను సాయి ధరమ్ తేజ్ సినిమా యూనిట్ పోస్ట్ చేసింది. ఇందులో ఒక చక్రం కనిపిస్తూ ఉండగా సిద్ధార్థ నామ సంవత్సరే బృహస్పతి సింహరాశి స్థితనమాయే అంతిమ పుష్కరే అంటూ పోస్టర్ మీద కనిపిస్తోంది. ఈ అక్షరాల వెనుక ఉన్న అంకెలు... ఆ అంకలే కథకు ఆరంభం ఈ పజిల్ ని డి కోడ్ చేయడం మొదలుపెడదాం... అంటూ పేర్కొన్నారు.ఇక ఈ సినిమాకి సంబంధించిన ట్రైలర్ అప్డేట్ ని ఇలా తిథులు రూపంలో పేర్కొన్నారని చర్చ జరుగుతోంది. ఈ సినిమా పూర్తి అయిన తర్వాత సాయి ధరమ్ తేజ్ పవన్ కళ్యాణ్ తో పాటు ఒక సినిమా చేస్తున్నాడు తమిళంలో సూపర్ హిట్ గా నిలిచిన వినోదయ సిత్తం ఈ సినిమా తెలుగు రీమేక్ గా తెరకెక్కుతుంది. సముద్ర ఖని డైరెక్షన్ లో ఈ సినిమా రూపొందుతోంది.

## టీమిండియాతో వన్డే సిరీస్.. ఆస్ట్రేలియాకు భారీ షాక్



మార్చి 17 నుంచి టీమిండియాతో ప్రారంభంకాబోయే 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియాకు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ పాట్ కమిన్స్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు.ఇటీవలే తుదిశ్వాస విడిచిన తల్లి మరణాంతర కార్యక్రమాలు జరిపించేందుకు కమిన్స్ స్వదేశంలోనే ఉండిపోనున్నాడు. దీంతో అతని గైర్హాజరీలో స్టీవ్ స్మిత్ ఆస్ట్రేలియా సారథ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఇవాళ (మార్చి 14) అధికారికంగా ప్రకటించింది. అయితే సీఏ.. కమిన్స్‌కు రీప్లేస్‌మెంట్‌ను ప్రకటించకపోవడం విశేషం.భారత్‌తో వన్డేలకు ఆసీస్ 15 మంది సభ్యులతోనే కంటిన్యూ కానుంది. టెస్ట్ సిరీస్ మధ్యలో గాయం కారణంగా స్వదేశానికి వెళ్లిన డేవిడ్ వార్నర్, దేశవాలీ టోర్నీ ఆడేందుకు వెళ్లిన ఆస్టన్ అగర్ తిరిగి వన్డే జట్టులో చేరిపోగా.. అదే టెస్ట్ సిరీస్ సందర్భంగా గాయపడిన జై రిచర్డ్సన్ రీప్లేస్‌మెంట్ నాథన్ ఇల్లీస్ కూడా వన్డే జట్టులో కొనసాగనున్నాడు.కాగా, బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ-2023లో రెండో టెస్ట్ అనంతరం కమిన్స్ తల్లి బాగోగులు చూసుకునేందుకు ఆస్ట్రేలియాకు బయలుదేరిన విషయం తెలిసిందే. తదనంతరం తల్లి మారియా మరణించడంతో కమిన్స్ ఆస్ట్రేలియాలోనే ఉండిపోయాడు. కమిన్స్ గైర్హాజరీలో స్టీవ్ స్మిత్ 3, 4 టెస్ట్‌ల్లో ఆస్ట్రేలియాను విజయవంతంగా ముందుండి నడిపించాడు.స్మిత్ సారథ్యంలో మూడో టెస్ట్‌లో ఆసీస్ భారత్‌ను ఓడించగా, నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది. ఫలితంగా 4 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. ఇదిలా ఉంటే, స్టీవ్ స్మిత్ ఆసీస్ వన్డే జట్టు పగ్గాలు చేపట్టనుండటంతో ఓ ఆసక్తికర విషయం వెలుగుచూసింది. భారత్‌తో తొలి వన్డే కలుపుకుని 5 వన్డేల్లో (ఆరోన్ ఫించ్, పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, స్టీవ్ స్మిత్) ఆసీస్‌కు నలుగురు కెప్టెన్లు సారథ్యం వహించారు.భారత్‌తో వన్డే సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు..డేవిడ్ వార్నర్, ట్రవిస్ హెడ్, స్టీవ్ స్మిత్ (కెప్టెన్), మార్నస్ లబూషేన్, మిచెల్ మార్ష్, మార్కస్ స్టొయినిస్, అలెక్స్ క్యారీ, గ్లెన్ మ్యాక్స్‌వెల్, కెమరూన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, సీన్ అబాట్, అస్టన్ అగర్, మిచెల్ స్టార్క్, నాథన్ ఇల్లిస్, ఆడమ్ జంపా

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**